
పులిచింతల వద్ద వరద ఉధృతి

ప్రకాశం బ్యారేజి నుంచి దిగువకు విడుదల అవుతున్న వరదనీరు



# కృష్ణమ్మ పరవళ్లు

కృష్ణమ్మ సాగరం దిశగా పరుగులు పెడుతూ ప్రవహిస్తోంది. ఎగువ నుంచి వరద ఉధృతి పెరుగుతూ ఉంది. దీంతో నాగార్జున సాగర్ నుంచి దిగువను ఉన్న అన్ని ప్రాజెక్టుల బంధనాలు తెంచుకుని సాగరంలో కలిసేందుకు పోటెత్తుతూ ప్రవహిస్తోంది. సోమవారం సాగర్ గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయగా రెండు రోజుల్లోనే పులిచింతల నిండుకుండలా మారింది. దీంతో బుధవారం పులిచింతల ప్రాజెక్టు గేట్లు కూడా ఎత్తి దిగువకు నీటి విడుదల చేశా రు. యథావిధిగా ప్రకాశం బ్యారేజి గేట్లును ఎత్తి ఉంచి నీటిని వదులుతున్నారు. ప్రవాహ ఉధృతి అంతకంతకూ పెరుగుతూ ఉండ టంతో కృష్ణానది పరివాహక ప్రాంతంలో ప్రజలను, రైతులను అధికారులు అప్రమత్తం చేశారు.

- కొనసాగుతున్న వరద ఉధృతి
- సాగరం దిశగా పోటెత్తుతోన్న వరద
- సాగర్ 18, పులిచింతల 13 గేట్లు ఎత్తి విడుదల


సాగర్ క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు


బ్యారేజి వద్ద నీటి ఉధృతిని పరిశీలిస్తున్న సీఎం

## బ్యారేజీ వద్ద ఉధృతిని పరిశీలించిన సీఎం చంద్రబాబు

ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతిని సీఎం చంద్రబాబు బుధవారం పరిశీలించారు. విజయవాడలో చేనేత దినోత్సవ కార్యక్రమం ముగించుకుని ఉండవల్లి వస్తూ బ్యారేజిపై కాన్వాయ్‌ను నిలిపి కిందకి దిగారు. కృష్ణమ్మ పరవళ్లను ఆసక్తిగా తిలకించారు. కృష్ణమ్మకు జలకళ, నీటి ప్రవాహం సంతృప్తిగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు నుంచి 1 లక్ష 36 వేలు, కీసర వాగు నుంచి 15 వేల క్యూసెక్కుల వరద నీరు బుధవారం ప్రకా శం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటిపారుదల శాఖ జేఈ దినేష్ తెలిపారు. బ్యారే జి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 50 గేట్లను 3 అడుగులు, 20 గేట్లను 2 అడుగులు వంతున ఎత్తి దిగువకు 1 లక్ష 37వేల 500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తూర్పు, పశ్చిమ డెల్టా కాల్వలకు 13వేల 500 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు జేఈ తెలిపారు. కాగా బుధ వారం అర్ధరాత్రికి వరద ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున తీరం వెంబడి రైతు లు, మత్స్యకారులు, లోతట్టు ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలని అధి కారులు సూచించారు.


కొల్లిపర కృష్ణానది రేవులో లంక గ్రామాల నుంచి పడవల ద్వారా వస్తున్న రైతులు


పులిచింతల వద్ద కృష్ణమ్మకు సారె సమర్పిస్తున్న ఎమ్మెల్యేలు భాష్యం ప్రవీణ్, శ్రీరాం తాతాయ్య


తాడువాయి కృష్ణా నది ఒడ్డున నిలిచిన మత్స్యకారుల పడవలు

మాచర్ల రూరల్, అచ్చంపేట, వీపీ సౌత్, రెం టచింతల, అమరావతి, తాడేపల్లి టౌన్, నూ జెండ్ల / నరసరావుపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్, పులిచింతలకు భారీగా వరద కొనసాగుతోంది. జలాశయాల నీటి నిల్వ పూర్తి స్థాయికి చేరుకున్నాయి. సాగర్ డ్యాం 18 క్రస్ట్ గేట్ల నుంచి దిగువకు 2,24,574 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో పులిచింతల నిండు కుండలా మారింది. పులిచింతలలో నీటి మట్టం పూర్తి స్థాయికి చేరడంతో బుధవారం ఉదయం 13 గేట్లు ఎత్తి దిగువకు 2.78 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎమ్మెల్యేలు భాష్యం ప్రవీణ్, శ్రీరాం తాతయ్య స్విచ్ అన్ చేసి నీటిని విడుదల చేశారు. అంతకముందు వారు కృష్ణమ్మకు పూజలు చేసి, జలహారతి ఇచ్చారు. కృష్ణమ్మకు సారె సమర్పించారు. జలాశయం ఆరు గేట్లను రెండున్నర మీటర్లు, ఏడు గేట్లను మూడు మీటర్ల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 175 అడుగులు కాగా బుధవారం 168.86 అడుగులకు చేరింది. 45.77 టీఎంసీలకు 36.78 టీ ఎంసీలకు నీటి నిల్వలు చేరుకున్నాయి. పులిచింతలకు 2,50,518 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండగా గేట్ల ద్వారా 2,78,573, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 10,000 మొత్తం 2,88,573 క్యూసెక్కుల నీరు దిగువ కు విడుదల చేస్తున్నారు. పులిచింతల నుంచి కృష్ణమ్మ ప్రకాశం బ్యారేజీకి పరుగులు పెడుతోంది. భారీగా నీటిని విడుదల చేయడంతో దిగువ ప్రాంతాల వారిని అప్రమత్తం చేశారు. నది వైపు వెళ్లకుండా పోలీసు, రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. దిగువ కృష్ణలో కృష్ణా జలాలు పెరగటంతో మత్స్యకారుల పడవలన్నీ ఒడ్డుకు చేరాయి. తాడువాయి వద్ద నది నుంచి మత్స్యకారులు తమ పడవలును ఒడ్డుకు చేర్చారు. పులిచింతల ప్రాజెక్టు నుంచి భారీగా నీటి ప్రభావంతో అమరావతి వద్ద కృష్ణానది జలకళను సంతరించుకుంది. సంవత్సర కాలంగా ప్రవాహం లేకపోవడంతో కళతప్పిన కృష్ణమ్మ ప్రస్తుతం పరుగులు తీస్తున్న నీటితో సరికొత్త కళను సంతరించుకుంది. నీటి పరవళ్ల చూసేందుకు స్థానికులు పెద్దసంఖ్యలో అమరావతి తీరానికి తరలి వస్తున్నారు.

### గుండ్లకమ్మకు జలకళ

నాలుగు రోజులుగా సాగర్ జలాలు విడుదలతో పాటు ఎగువ ప్రాంతాల్లో కురుస్తోన్న వర్షాలతో గుండ్లకమ్మ నది జలకళను సంతరించుకుంది. నూ జెండ్ల మండలంలోని గుండకమ్మ నది పరివాహ ప్రాంతాల్లో సాగు, తాగు నీటి కష్టాలకు ఉపశ మనం లభించినట యింది. వరి నారుకు ప్రసిద్ధి గాంచిన ఐనవోలు గ్రామంలో నారుమళ్లను రైతులు సిద్ధం చేసుకుంటున్నారు.


జలకళతో గుండ్లకమ్మ నది

### సాగర్‌లో కొనసాగుతోన్న విడుదల

నాగార్జున సాగర్‌కు భారీగా వరద కొనసాగుతుండటంతో జలాశయం నీటి నిల్వ పూర్తి స్థాయికి చేరింది. డ్యాం 18 క్రస్ట్ గేట్ల నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. 3,50,730 క్యూసెక్కుల ప్రవాహం ఉండగా క్రస్ట్ గేట్లను ఒక్కొక్కటి 10 అడుగుల మేర ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. గేట్ల నుంచి 2,24,574, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 29,151, కుడి కాల్వకు 6,873, ఎడమ కాల్వకు 8,193 క్యూసెక్కుల వెరసి 2,70,591 క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది. సాగర్ నీటి మట్టం 590 అడుగులకు 584.60 అడుగులకు చేరింది. సామర్థ్యం 312.05 టీఎంసీలకు 296.28 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

### వచ్చిన నీరు వచ్చినట్లే దిగువకు: ఎస్ఈ వెంకటరమణ

సత్రశాల వద్ద నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తోన్న నీటిని వచ్చిన మేర దిగువన ఉన్న పులిచింతలకు విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కోలేగుండ్ల వెంకటరమణ చెప్పారు. బుధవారం సాగర్ నుంచి 2 లక్షల 76 వేల క్యూసెక్కుల నీరు రాగా టెయిల్ పాండ్ ప్రాజెక్టు 12 గేట్లను 4 మీటర్ల మేర ఎత్తి దిగువకు పంపుతున్నామన్నారు. విద్యుత్ ఉత్పత్తిని నిలిపి వేశామన్నారు. రిజర్వాయర్‌లో ప్రస్తుతం 74.02 మీటర్ల నీరుండగా ఈ నీరు 6.2 టీఎంసీలకు సమానమన్నారు.

## వరద.. వణుకు

- బ్యారేజి దిగువ ప్రాంతాల్లో ముంపుభయం
- సముద్రంలోకి 1.5 లక్షల క్యూసెక్కులు నీరు
- నేడు 3 నుంచి 4 లక్షల క్యూసెక్కులకు ప్రవాహం
- పెరుగుతోన్న వరద ఉధృతి.. అధికారులు అప్రమత్తం

తెనాలి(ఆంధ్రజ్యోతి), కొల్లిపర, ఆగస్టు 7: కృష్ణానదీ పరివాహక గ్రామాల ప్రజల్లో వరద భయం మొదలైంది. బ్యారేజి దగ్గర పట్టిసీమ నీరు పుష్కలంగా ఉండటంతో పులిచింతల నుంచి వచ్చిన నీటిని వచ్చినట్లుగా సముద్రంలోకి వదిలేస్తున్నారు. ప్రస్తుతం నదిలో 1.5 లక్షల క్యూసెక్కుల వరకు మాత్రమే వరద నీరు ప్రవహిస్తున్నా, గురువారానికి మరింత పెరిగే పరిస్థితి ఉంది. దీంతో బ్యారేజి దిగువునున్న లంక గ్రామాలను ముంపు భయం వెంటాడుతోంది. ఇప్పటికే అరటి, పసుపు, కంద, తమలపాకు, బొప్పాయి వంటి వాణిజ్యపంటలు చేలల్లో ఉన్నాయి. బుధవారం పులిచింతల నుంచి 2,92,462 క్యూసెక్కుల నీటిని బ్యారేజికి వదిలారు. ఆ నీరు గురువారం తెల్లవారుజాము నుంచి బ్యారేజి దిగువకుచేరే పరిస్థితి ఉందని అధికారులు చెబుతున్నారు. బుధవారం ఉదయం 9 గంటల సమయంలో 73వేల క్యూసెక్కుల ప్రవాహం ఉండగా సాయంత్రం 4 గంటలకు అది 1.30 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. బ్యారేజి దిగువున కృష్ణా నదిలో 9 నుంచి 12 అడుగుల వరకు నీటి మట్టం పెరిగే పరిస్థితి ఉంది. దీంతో లంక గ్రామాల్లో జనం, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేతికొచ్చి పంటలకు నష్టం ఏర్పడుతుందనే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముంపు ప్రాంతాల్లో మాత్రం రైతులు విద్యుత్ మోటార్లు, ఆయిల్ ఇంజన్లను ఒడ్డుకు చేర్చుతున్నారు. వరద ప్రభావం పెరుగుతుందన్న ఆలోచనతో రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తమైంది. లంకగ్రామాల్లో, నది మధ్య ఉన్న గ్రామాల ప్రజలు అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు ఎప్పుడైనా వచ్చేందుకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. బ్యారేజి దిగువన ఉన్న గుంటూరు జిల్లా తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల, కొల్లిపర, బాపట్ల జిల్లా కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల నదీ తీర గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. వరద నీటి ప్రవాహం నిలకడగా ఉంటే పర్వాలేదని, పెరిగే పరిస్థితి ఉంటే మాత్రం సురక్షిత ప్రాంతాలకు తరలించాలని రెండు జిల్లాల కలెక్టర్లు ఇప్పటికే ఆదేశాలు జారీచేశారు. కొల్లిపర తహశీల్దార్ సిద్ధార్థ, ఇన్‌చార్జి ఎంపీడీవో చంద్రమోహన్‌వల్లభాపురం, మున్నంగి, పిడపర్తిపాలెం కొల్లిపర, బొమ్మువానిపాలెం, అన్నవరం రేవులను సందర్శించి వరద ఉధృతిని పరిశీలించారు. జాలర్లు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.

# చేనేత సంక్షేమంపై చిత్తశుద్ధి

రాబోయే రోజుల్లో పూర్వ వైభవం

- చేనేత దినోత్సవంలో మంత్రి సత్యకుమార్ యాదవ్


లబ్ధిదారులకు రుణాల చెక్కును పంపిణీ చేస్తున్న మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్సీ అనురాధ, కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు

మంగళగిరి సిటీ, ఆగస్టు 7: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేతల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్నాయని రాష్ట్ర వైద్య విద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవంలో మంగళగిరిలో బుధవారం జరిగింది. మంత్రి తొలుత చినకాకాని ఎన్నారై జంక్షన్‌లోని నేతన్న విగ్రహానికి అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పూలమాలలు వేశారు. అనంతరం శ్రీమార్కండేయ పద్మశాలీయ కల్యాణ మండపంలో జరిగిన చేనేత దినోత్సవ సభలో మంత్రి ప్రసంగించారు. రాబోయే రోజుల్లో సీఎం చంద్రబాబు నేతృత్వంలో చేనేత పూర్వవైభవం సంతరించుకుంటుందని చెప్పారు. గత వైసీపీ పాలనలో చేనేత రంగం పూర్తిగా నిర్వీర్యమైపోయిందన్నారు. నేతన్న నేస్తంలో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయన్నారు. వృత్తితో ఏమాత్రం సంబంధంలేని వైసీపీ కార్యకర్తలకు నేతన్న నేస్తం ఇచ్చారని ఆరోపించారు. వైసీపీ పాలనలో వందలాది మంది కార్మికులు హత్యలు, ఆత్మహత్యలు, ఆకలి చావులకు గురయ్యారని, వాటన్నింటినీ వైసీపీ ప్రభుత్వ హత్య లుగానే భావించాల్సి ఉంటుందన్నారు. ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ మాట్లాడుతూ మంగళగిరిలో మంత్రి నారా లోకేశ్ చేనేతకు పూర్వవైభవం తీసుకువచ్చే దిశగా కృషి చేస్తున్నారని చెప్పారు. అనంతరం వివిధ బ్యాంకుల ద్వారా ముద్ర రుణాలకు సంబంధించి 110 మందికి రూ.కోటి 7 లక్షలను చేనేత లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వృత్తి నైపుణ్యం కలిగిన చేనేత కళాకారులు, నాయకులను ఘనంగా సన్మానించారు. చేనేత దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన విక్రయ శాలలో మంత్రి సత్యకుమార్ చేనేత వస్త్రాలను కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరు ఎస్.నాగలక్ష్మి, చేనేత జౌళి శాఖ ఏడీ వనజ, యూనియన్ బ్యాంకు డీజీఎం జవహర్, ఎల్‌డీఎం మహిపాల్‌రెడ్డి, జిల్లా సంయుక్త కలెక్టరు ఎ.భార్గవ్ తేజ, తెనాలి సబ్ కలెక్టరు ప్రఖార్‌జైన్, ఎంటీఎంసీ కమిషనరు అలీమ్ బాషా, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు, ఉపాధ్యక్షుడు కాండ్రు శ్రీనివాసరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు దామర్ల రాజు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పంచుమర్తి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# 30 రోజుల్లో జంగిల్ క్లియరెన్స్




- పనులు ప్రారంభించిన మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

తుళ్లూరు, ఆగస్టు 7: ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం రాజధాని అమరావతిని అడవిలా చేసింది.. మేము 30 రోజుల్లో జంగిల్ క్లియరెన్స్ చేసి అమరావతికి ఓ రూపు తెస్తాం.. అని మంత్రి నారాయణ తెలిపారు. వెలగపూడి సచివాలయ పరిసరాల్లో బుధవారం తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్‌తో కలిసి మంత్రి నారాయణ జంగిల్ క్లియరెన్స్ పనులను ప్రారంభించారు. వర్షంలోనే తొలుత పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టి ఎక్స్‌కవేటర్ ఎక్కిన మంత్రి, ఎమ్మెల్యేలు పది నిమిషాలు సేపు కంప తొలిగించారు. అనంతరం మంత్రి విలేకర్లతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం 24 వేల ఎకరాను అడవిలా చేసిందన్నారు. జగన్‌రెడ్డి మూడు ముక్కలాటతో అమరావతికి తీవ్ర నష్టం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబు అమరావతి నిర్మాణాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారన్నారు. అమరావతిలో ముఖ్యమంత్రి పర్యటించినప్పుడు ఎత్తైన భవనాలు సైతం అడవి మధ్యలో ఉన్నట్లు కనిపించాయన్నారు. ఈ పరిస్థితి నుంచి ముందుగా అమరావతిని పూర్తిగా బయటకు వచ్చేలా కంప, తుమ్మ చెటట్లను తొలగించాలని సీఎం ఆదేశించారన్నారు. అందులో భాగంగానే ముందు అమరావతిలో జంగిల్ క్లియరెన్స్ పనులకు శ్రీకారం చుట్టామన్నారు. రూ.36.5 కోట్లతో 23 వేల 429 ఎకరాల్లో జంగిల్ క్లయరెన్స్ పనులను 30 రోజుల్లో పూర్తి చేసేలా ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అమరావతి పనులకు ఇది మొదటి అడుగన్నారు. అమరావతి నిర్మాణాలపై అధ్యయనం చేసిన ఐఐటీ హైదరాబాద్, మద్రాసు నుంచి త్వరలో ప్రాథమిక నివేదిక వస్తుందని దాని ఆధారంగా నిర్ణయం తీసుకుంటుమన్నారు. ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ అమరావతిని నాశనం చేసిన జగన్ ప్రజలపై భారం వేశాడన్నారు. ఈ కార్యక్రమంలో రైతు జేఏసీ నేత పువ్వాడ సుధాకరరావు తదితరులు పాల్గొన్నారు.


ఎక్స్‌కవేటర్లతో జంగిల్ క్లియరెన్స్

# చుక్కలపై మళ్లీ చెక్

- స్వతంత్రం చేసిన భూముల పునర్‌పరిశీలన
- రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలకు కలెక్టర్ ఆదేశాలు



గుంటూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో ఫ్రీహోల్డ్(స్వతంత్రం) చేసిన చుక్కలు, అసైన్డ్ భూములను పునర్ పరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ విషయంలో కలెక్టర్ ఎస్ నాగలక్ష్మికి నిర్దిష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులకు ఈ విషయంపై ఆదేశాలు ఇచ్చారు. సాధ్యమైనంత త్వరగా ఒక మండలాన్ని తీసుకుని అక్కడ ఫ్రీహోల్డ్ చేసిన భూములపై నివేదికని అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. మరోవైపు 22ఏ కేటిగిరీలకు సంబంధించిన భూముల రిజిస్ట్రేషన్లను రాష్ట్ర ప్రభుత్వం మూడు నెలల పాటు నిలిపేసింది. దీంతో వైసీపీ హయాంలో జరిగిన అక్రమాలన్నీ వెలుగులోకి వస్తాయన్న అభిప్రాయం వ్యక్తమౌతున్నది. రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన డీకేటీ పట్టాభూములపై వైసీపీ ప్రభుత్వం ఫ్రీ హోల్డ్ చేసింది. 2003కి ముందు 20 ఏళ్ల సమయం దాటిపోయిందని పేర్కొంటూ స్వతంత్రంగా మార్చివేసింది. ఈ విధంగా జిల్లాలో 75 ఎకరాల వరకు ఫ్రీహోల్డ్ చేశారు. ఇంకోవైపు కలెక్టర్ అధ్యక్షతన ఉండే చుక్కల భూముల పరిష్కార కమిటీ దాదాపుగా 600 ఎకరాలను డాటెడ్ ల్యాండ్స్ నుంచి తొలగించింది. వైసీపీకి చెందిన నేతలకు మేలు చేకూర్చి పెట్టేందుకే ఇలా చేశారని ప్రస్తుత ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం భావిస్తున్నది. ఈ నేపథ్యంలో వాటిని వెలుగులోకి తీసుకురావాలని నిర్ణయించింది. కాగా జిల్లాలో ఫ్రీహోల్డ్ చేసిన డీకేటీ పట్టాభూముల విస్తీర్ణం ఇతర జిల్లాలతో పోల్చితే చాలా తక్కువని రెవెన్యూవర్గాలు చెబుతోన్నాయి. అయితే చుక్కల భూములు 600 ఎకరాలకు పైగా తీసేయడంపై కొన్ని అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. అయితే దీనికి సంబంధించి తహసీల్దార్, ఆర్‌డీవో స్థాయి అధికారుల నివేదికలు, జిల్లా స్థాయి కమిటీ తుది నిర్ణయం తీసుకొన్నాయని చెబుతున్నాయి.



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం అధికారులు, మినిస్ట్రీ ఆఫ్ కన్స్యూమర్ అఫైర్స్ అధికారులు

## ఆధునిక వ్యవసాయ పద్ధతులపై పరిశోధనలు

● వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మీదేవి

లాంఫాం (తాడికొండ) ఆగస్టు 7: ఆచార్య ఎన్.జీ.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఇండియన్ స్టాండర్డ్స్ ప్రకారం ఆధునిక వ్యవసాయ పద్ధతులపై పరిశోధనలు నిర్వహిస్తుందని వీసీ డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మీదేవి తెలిపారు. బుధవారం లాంఫాంలోని ఆచార్య ఎన్.జీ.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిపాలన భవనంలో ఎన్.జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, బ్యూర్ ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్, మినిస్ట్రీ ఆఫ్ కన్స్యూమర్ అఫైర్స్, ఫుడ్ అండ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ వారి మధ్య డెవలప్‌మెంట్ ఆఫ్ స్టాండర్డ్స్ డైజెడ్ అగ్రికల్చర్ డెమొనిస్ట్రేషన్ ఫార్మ్స్ కోసం అవగాహన ఒప్పందం చేసుకున్నారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ అగ్రికల్చర్ డెమొనిస్ట్రేషన్ ఫార్మ్‌గా తయారు చేసి వ్యవసాయ పనిముట్లు, నీటి యాజమాన్యం, పురుగులు తెగుళ్ళు, పోషకాల యాజమాన్యం ఇండియన్ స్టాండర్డ్స్ ప్రకారం డెమొనిస్ట్రేషన్ చేయడం జరుగుతుందన్నారు. ఈ ఫార్మ్‌ని వివిధ స్టాక్ హోల్డర్స్‌కి ఆధునిక వ్యవసాయ విధానాలను బోధించడానికి శిక్షణ ఇవ్వటానికి ఉపయోగిస్తారని తెలిపారు. కార్యక్రమంలో బ్యూర్ ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ ఎం.ఏ.జే వినోద్, సీనియర్ డైరెక్టర్, హెడ్ శ్రీకృష్ణవీర్‌వర్మ, రిజిస్ట్రార్ డాక్టర్ జీ.రామచంద్రరావు, డీన్ డాక్టర్ జీ.కరుణాసాగర్, డీన్ ఆఫ్ కమ్యూనిటి సైన్స్ డాక్టర్ బీ. శ్రీలక్ష్మి, డీన్ పీజీ స్టడీస్ డాక్టర్ ఏ.వీ.రమణ, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ పీ.వీ.సత్యనారాయణ, డాక్టర్ టీవీఎస్ ప్రసాద్, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## బీసీ ఉద్యోగ సంఘం నూతన కార్యవర్గం

● అధ్యక్షుడిగా సీహెచ్ సాంబశివరావు ఎన్నిక

పెదకాకాని, ఆగస్టు 7: ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో బీసీ ఉద్యోగుల సమాఖ్య నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సీహెచ్. సాంబశివరావు, కార్యదర్శిగా ఐ.సాయిరాములను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా డీ.వీరాంజనేయులు, సూర్యకుమారి, కోశాధికారిగా విద్యాసాగర్, జాయింట్ సెక్రటరీగా ఎస్.శ్రీనివాస్, ఎస్‌కే దరియా, కార్యవర్గ సభ్యులను ఎనునకున్నారు. ఈ కార్యవర్గానికి గౌరవ అధ్యక్షుడిగా ఎన్నికైన ప్రొఫెసర్ త్రిమూర్తిరావు మాట్లాడుతూ బీసీ ఉద్యోగులంతా ఐక్యంగా తమ హక్కులను సాధించుకునే దిశగా పనిచేయాలని, అందుకు తనవంతు కృషిని అందిస్తానని చేస్తానని హామీ ఇచ్చారు. అధ్యక్ష కార్యదర్శులు సీహెచ్. సాంబశివరావు, ఐ.సాయిరాంలు మాట్లాడుతూ బీసీ ఉద్యోగుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషిచేస్తానని, బీసీ ఉద్యోగులకు అందుబాటులో ఉండి వారి పదోన్నతులు బదిలీల విషయంలో జరుగుతున్న అన్యాయంపై న్యాయపోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో డీరామాంజనేయులు, సూర్య కామేశ్వరి, విద్యాసాగర్ శ్రీనివాస్, ఎస్‌కే దరియా, పూలే కేంద్రం ప్రోగ్రామర్ బీ.కోటియాదవ్, వాసుదేవ్ పాల్గొన్నారు.

# ప్రజా దర్బార్‌కు వినతుల వెల్లువ

● 22వ రోజు అధిక సంఖ్యలో హాజరైన ప్రజలు
● భూ కబ్జాలపై భారీగా అర్జీలు
● పరిశీలించి పరిష్కరిస్తానని మంత్రి లోకేశ్ హామీ

తాడేపల్లి, ఆగస్టు 7: నారా లోకేశ్ ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్‌కు బుధవారం 22వ రోజు జోరువానలోనూ కొనసాగింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి అర్జీదారులు ఉండవల్లి కరకట్ట వద్దకు విచ్చేసి యువనేత, మంత్రి నారా లోకేశ్‌ను కలిసి సమస్యలు విన్నవించి పరిష్కరించాలంటూ వినతిపత్రాలు అందించారు.

మంగళగిరి 17వవార్డుకు చెందిన ఓసూరు వెంకయ్య లోకేశ్‌ను కలిసి గౌతమబుద్ధా రోడ్డులో నివాసం ఉండే తన ఇంటిని గత వైసీపీ ప్రభుత్వం రోడ్డు వెడల్పు పేరుతో తన ఇంటిని సగ భాగం కూల్చిందని నష్టపరిహారం ఇవ్వలేదని అనుమతి లేకుండా అక్కడ విద్యుత్ టాన్స్‌ఫార్మ్ సైతం ఏర్పాటు చేశారని బోరుమన్నారు. సమస్య పరిష్కరిస్తానని లోకేశ్ హామీ ఇచ్చారు.

ఏలూరు జిల్లా, పొంగుటూరు గ్రామానికి చెందిన పసుపులేటి శ్రీను లోకేశ్‌ను కలిసి జాతీయ రహదారి కోసం సేకరించిన తన మూడు ఎకరాల భూమికి తక్కువ పరిహారం అందించారని మార్కెట్ విలువ ప్రకారం నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని గత వైసీపీ ప్రభుత్వంలో ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదని వాపోయారు. సమస్య విన్న మంత్రి లోకేశ్ పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.





వినతి పత్రాలు స్వీకరిస్తున్న నారా లోకేశ్

తాడేపల్లి, తెనాలి మున్సిపాలిటి పరిధిలో ఎస్సీ సబ్ ప్లాన్ కింద పూర్తి చేసిన సివిల్ పనులకు గత వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో తీవ్రంగా నష్టపోయానని మంగళగిరికి చెందిన ఆర్.అశోక్ బాబు అనే కాంట్రాక్టర్ మంత్రి లోకేశ్‌కు వివరించారు. పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. బిల్లులు మంజూరు చేయించాలని విజ్ఞప్తిచేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటానని మంత్రిలోకేశ్ హామీ ఇచ్చారు.

పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన తన మూడు ఎకరాల అసైన్డ్ భూమిని గత వైసీపీ ప్రభుత్వ అండతో కబ్జాచేశారని ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంకు చెందిన గుంటి రాము మంత్రి లోకేశ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. తప్పుడు పత్రాలతో తమ భూమిని ఇతరుల పేరుతో రిజిస్ట్రేషన్ చేయించారని, ప్రశ్నించిన తమపై దాడిచేసి భయభ్రాం తులకు గురిచేస్తున్నారని కన్నీటిపర్యంతమ య్యారు.

సీఆర్‌డీఏ రైతుకూలీ పెన్షన్ అందించి ఆదుకోవాలని మంగళగిరి నియోజకవర్గం ఉండవల్లి ఎస్సీ కాలనీకి చెందిన చెందిన జే ప్రియాంక, తన ఇద్దరు కుమార్తెలకు ఉద్యోగం కల్పించడంతో పాటు టిడ్కో ఇంటిని మంజూరు చేసి ఆదుకోవాలని ఉండవల్లికి చెందిన శిఖా శేఖర్‌బాబు, ఇంటి స్థలం మంజూరు చేయాలని చినకాకానికి చెందిన కే.ధనరాజ్, ఉద్యోగ అవకాశం కల్పించాలని అనకాపల్లి జిల్లా బోయలకింతాడ గ్రామానికి చెందిన డీవీఎల్ఎన్ మూర్తి, పలువురు తమ సమస్యలను మంత్రి నారా లోకేశ్ విన్నవించారు. ఆయా సమస్యలను పరిశీలించి, పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.



బాధితుల గోడు ఆలకిస్తున్న మంత్రి నారా లోకేశ్

రేపు హెచ్‌సీఎల్ ఐటీ శిక్షణకు

## ఇంటర్ విద్యార్థుల ఎంపికలు

గుంటూరు(విద్య),ఆగస్టు 7: నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇంటర్ బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ గ్రూపులతో పూర్తిచేసిన వారికి ఐటీ శిక్షణ ఇవ్వనున్నట్లు నైపుణ్యాభివృద్ధి అధికారి పీ.ప్రణయ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈమేరకు ఈనెల 9న ప్రభుత్వ ఐటీఐ కళాశాల (గుంటూరు కలెక్టరేట్ ఎదుట) క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు 2023, 2024 విద్యాసంవత్సరాల్లో 75 శాతం మార్కులతో ఇంటర్ (బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ) పూర్తి చేసి ఉండాలని సూచించారు. ఆసక్తి ఉన్నవారు తమ బయోడేటా, విద్యార్హతల సర్టిఫికెట్స్, జిరాక్స్, ఆధార్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఇంటర్వ్యూలకుహాజరుకావాలని సూచించారు. హెచ్ఆర్ ఇంటర్వ్యూ, రాత పరీక్ష ద్వారా ఐటీ శిక్షణకు ఎంపిక చేస్తామని, ఇతర వివరాల కోసం మణిదీప్ (8074607278) సంప్రదించాలని సూచించారు.

## నేడు జాబ్ మేళా

గుంటూరు(విద్య),ఆగస్టు7 : గుంటూరు జిల్లా ఉపాధి కార్యాలయంలో గురువారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి అధికారి కే.రఘు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ నుంచి డిగ్రీ, పీజీ, బీటెక్ పూర్తిచేసి 18 నుంచి 35 సంవత్సరాలలోపు వయసు ఉన్న అభ్యర్థులు ఇందుకు అర్హులని తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్నవారు గుజ్జనగుండ్లలోని జిల్లా ఉపాధి కార్యాలయం (కావూరి కాంప్లెక్స్)లో జరిగే ఇంటర్వ్యూలకు బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. ఇతర వివరాల కోసం 98668 22697లో సంప్రదించాలని కే.రఘు కోరారు.

## యువతకు స్వయం ఉపాధి శిక్షణ

గుంటూరు (విద్య), ఆగస్టు 7: యూనియన్ బ్యాంకు గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు రిఫ్రిజరేషన్, ఏసీ సర్వీసింగ్, కంప్యూటర్ ట్యాలీలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ బీజీ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుంటూరు ఉమ్మడి జిల్లా అభ్యర్థులకు ఈ శిక్షణ పొందుటకు అర్హులని, శిక్షణతోపాటు వసతి, భోజన సౌకర్యం అందిస్తామని తెలి పారు. అభ్యర్థులు పది పాస్ లేదా ఫెయిల్ అయి ఉండి, 19 నుంచి 45 సంవత్సరాలు వయసు ఉన్న వారు అర్హులని తెలిపారు. అభ్య ర్థులు తెల్లరేషన్ కార్డు, ఆధార్, నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో యూనియన్ బ్యాంకు గ్రామీణాభివృద్ధి సంస్థ, డోర్‌నం.14-1-14, ఓల్డ్ బ్యాంకు స్ట్రీట్, కొత్తపేట, గుంటూరు (సెల్ : 9700687696, 8125397953) దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## 13న పెన్షన్ అదాలత్

గుంటూరు(విద్య),ఆగస్టు 7: ఈనెల 13న కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని భవిష్యనిధి పెన్షనర్ల ఫిర్యాదుల పరిష్కారం కోసం పెన్షన్ అదాలత్ నిర్వహిస్తునట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ ఇంద్రనీల్‌ఘోష్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమస్యలు ఆన్‌లైన్, మెయిల్, వెబ్‌నార్, పోస్టు ద్వారా తమ ఫిర్యాదులు, సమస్యలు పంపవచ్చునని వెల్లడించారు. కార్యాలయ ఈమెయిల్ ro.guntur@epfindia.gov.in వాట్సాప్ నం. 949465 7469, ఫొన్ 0863-2344106,0863,2232921, వెబ్ ఎక్స్ ఐడీ 2644 636 3676, పాస్ కోడ్ epfo@1234 ద్వారా పంపాలని సూచించారు.



అన్న క్యాంటీన్ భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

## పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్

● చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు
● క్యాంటీన్ల వద్ద అధునికీకరణ పనుల పరిశీలన

చిలకలూరిపేట అర్బన్, ఆగస్టు 7 : కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభిచనున్న అన్నక్యాంటీన్‌లు పేదల ఆకలి తీర్చనున్నాయని చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. బుధవారం ఆయన పట్టణంలోని గడియారస్తంభం, ఎన్టీఆర్‌సెంటర్, అడ్డరోడ్డు వద్దగల అన్నక్యాంటీన్‌లను సదర్శించి జరుగుతున్న పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ప్రజలు ఆకలి ఎలా తీర్చాలన్న సంకల్పంతో చంద్రబాబు అన్నా క్యాంటీన్‌లు ప్రారంభిస్తే, ప్రజల ఆస్తులు దోచుకోవాలనే దుర్బుద్ధితో జగన్ పనిచేశాడని అన్నారు. అందుకే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్, పాసు బుక్‌లు, సర్వే రాళ్ళ పై తన బొమ్మలు వంటి వికృత చర్యలకు పూనుకున్నాడని దుయ్యబట్టారు. గతంలో ఇచ్చిన హామి మేరకు ఆగస్టు 15న రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్‌లు పునఃప్రారంభం కానున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చేవరకు చిలకలూరిపేటలో సొంత నిధులతో రెండు అన్న క్యాంటీన్‌లు ఏర్పాటు చేసి పేదల కడుపు నింపిన విషయాన్ని గుర్తుచేశారు. ఒక పట్టణంలో మూడు అన్నక్యాంటీన్‌లు ఏర్పాటు చేయటం చాలా అరుదని, అలాంటిది తాను మంత్రిగా ఉన్న సమయంలో చిలకలూరిపేటలో మూడు అన్న క్యాంటీన్‌లను ఏర్పాటు చేశామన్నారు.

## జీవన ప్రమాణ పత్రాలు సమర్పించాలి

● పెన్షన్‌దారులను కోరిన పీఎఫ్ ప్రాంతీయ కమిషనర్ ఇంద్రనీల్‌ఘోష్

గుంటూరు (విద్య), ఆగస్టు 7: జిల్లాలోని పెన్షన్‌దారులు (ఈపీఎస్, ఎఫ్‌పీఎస్) తమ జీవన పత్రాలను నిర్దేశించిన మార్గాల ద్వారా విధిగా సమర్పించాలని పీఎఫ్ ప్రాంతీయ కమిషనర్ ఇంద్రనీల్‌ఘోష్ బుధవారం ఒక ప్రకటనల పేర్కొన్నారు. పెన్షన్ తీసుకునే బ్యాంకు లేదా పీఎఫ్ కార్యాలయం, మీసేవా, పోస్టు ఇన్ఫో యాప్, అడ్రాయిడ్ ఫోన్‌లోని ఆధార్‌ఫెస్ యాప్ ద్వారా జీవన ప్రమాణ పత్రాలు పంపాలని సూచించారు. పెన్షన్‌దారులు తమ అభ్యర్థన తెలియజేస్తే పోస్టుమ్యాన్ ఇంటికి వచ్చి వేలుముద్ర, ఐరిష్ ద్వారా జీవన ప్రమాణ పత్రాలు స్వీకరిస్తారని తెలిపారు. ఇతర వివరాల కోసం గుంటూరు నగరంలోని కృష్ణనగర్ వద్ద గల ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ కార్యాలయంలో సంప్రదించాలని పెన్షన్‌దారులకు సూచించారు.

## పిడుగురాళ్లలో చెన్నై షాపింగ్‌మాల్

● ప్రారంభించిన సినీనటి అనుపమా పరమేశ్వర్

పిడుగురాళ్ల, ఆగస్టు7: పల్నాడు జిల్లా పిడుగురాళ్ల పట్టణంలో అధునాతన హంగులతో సరికొత్తగా రూపుదిద్దుకున్న చెన్నైషాపింగ్ మాల్‌ను బుధవారం సినీనటి అనుపమా పరమేశ్వర్, యాజమాన్యం ప్రారంభించారు. ఇది తెలుగు రాష్ట్రాల్లో 18వ షాపింగ్‌మాల్. నూతన వస్త్రాలు అన్నివర్గాల వారికి అందుబాటు ధరల్లో వుండటంతో మొదటిరోజే కొనుగోలుదారులు కిక్కిరిసిపోయారు. వస్త్రాల కొనుగోలుపై ఆఫర్‌లు ప్రకటించడంతో మాల్ ముందు ప్రజలు బారులుతీరారు. వెరైటీ డిజైన్‌లు, ఉమెన్స్‌వేర్, కిడ్స్‌వేర్, మెన్స్‌వేర్‌లు ఆకట్టు కునేలా ఉన్నాయంటూ కొనుగోలుదారులు క్యూకట్టారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చెన్నైషాపింగ్ మాల్‌ని సందర్శించారు. పిడుగురాళ్లలో అతిపెద్ద షాపింగ్‌మాల్‌ను ఏర్పాటు చేసిన యాజమాన్యాన్ని ఆయన అభినందించారు.



పిడుగురాళ్ల చెన్నై షాపింగ్ మాల్‌లో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో సినీనటి అనుపమ పరమేశ్వర్

ఏఎన్‌యూ యూజీసీ ఇన్‌చార్జి కో-ఆర్డినేటర్‌గా

## ప్రొఫెసర్ వై. అశోక్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

పెదకాకాని, ఆగస్టు 7 : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ యూజీసీ విభాగం ఇన్‌చార్జి కో-ఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ వై.అశోక్ కుమార్ బాధ్యతలు చేపట్టారు. బుధవారం ఏఎన్‌యూ యూజీసీ కోఆర్డినేటర్ కార్యాలయంలో మాజీ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఏ. కృష్ణసత్య నుంచి అశోక్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జీ.సింహాచలం అశోక్ కుమార్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ యూజీసీ, యూనివర్సిటీ మధ్య అనుసంధానకర్తగా ఉంటూ విధి నిర్వహణలో చిత్తశుద్ధితో పనిచేసి వర్సిటీ అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతానన్నారు. అనంతరం అశోక్ కుమార్‌కు దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వీ.వెంకటేశ్వర్లు, సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ ఎం.త్రిమూర్తిరావు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్. స్వరూపరాణి, దూరవిద్య కేంద్రం పరీక్షల కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ డీ.రామచంద్రన్, యూజీసీ మాజీ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ రత్నాకర్, ఓఎస్‌డీ ప్రొఫెసర్ ఆర్‌వీఎస్ఎస్ ఎన్.రవికుమార్, తదితరులు అశోక్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అంబేద్కర్ చైర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అబ్రహం లింకన్ డాక్టర్‌గోపికృష్ణ, ఉద్యోగులు ఎం.రాధాకృష్ణ, అతిథి అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.

### నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

### బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 91, 99,110 |
| చికెన్ విత్ స్కిన్ | 176.00 |
| చికెన్ స్కిన్ లెస్ | 186.00 |

ఎంబీబీఎస్ సీట్లు పెంచకుండా

## ఈడబ్ల్యూఎస్ రిజర్వేన్లు అమలు తగదు

గుంటూరు(విద్య),ఆగస్టు 7: ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ సీట్లు అమ్ముకునేందుకు అనుకూలంగా తీసుకువచ్చిన జీవో 107, 108 రద్దు చేయాలని, సీట్లు పెంచకుండా ఓసీ సీట్లలో కోత విధించి ఈడబ్ల్యూఎస్ అమలు చేయడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్ (ఏపీఎంపీఏ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం వైద్య కళాశాలల్లో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అమలు చేస్తే బీసీ ,ఎస్టీ, ఎస్సీ, ఓసీ జనరల్ విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఇప్పుడున్న వివిధ కేటగిరి సీట్లు తగ్గించకుండా సీట్లు పెంచిన తర్వాతే ఈడబ్ల్యూఎస్ అమలు చేయాలని కోరారు. తాము ఇడబ్ల్యూఎస్‌కు వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. మెడికల్ కళాశాలల్లో సీట్లు పెంచిన తర్వాతే దీనిని అమలు చేయాలని కోరారు.



రవీంద్రనాథ్ ఠాగూర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జి వీసీ, తదితరులు

## ప్రపంచం గర్వించే కవి రవీంద్రనాథ్ ఠాగూర్

పెదకాకాని, ఆగస్టు 7 : భారతదేశానికి నోబెల్ బహుమతి తీసుకువచ్చిన రవీంద్రనాథ్ ఠాగూర్ ప్రపంచం గర్వించే కవి అని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావు అన్నారు. బుధవారం ఠాగూర్ 83వ వర్థంతిని పురస్కరించుకొని యూనివర్సిటీలోని ఆయన విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ కవిగా సాంఘిక సంస్కర్తగా, స్వరకర్తగా నాటక రచయితగా ఆయన భారతీయులలో భావోద్వేగాలను రేకెత్తించారని అన్నారు. విద్యార్థులు తమ లక్ష్య సాధనలో ఠాగూర్ వంటి మేధావులను ఆదర్శప్రాయంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జీ.సింహాచలం, సీడీసీ ఇన్‌చార్జి డీన్ ప్రొఫెసర్ వీ.రవికుమార్, సీఎస్ఆర్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎన్వీ రమణ, యూనివర్సిటీ ఇంజనీర్ డీఏ. కుమార్‌రాజు, ఉద్యోగులు, టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు బీ.హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.



ప్రదర్శనలో వైద్యులు గూడూరు సీతామహాలక్ష్మీ, దివ్య తేజోమూర్తి, రమణ యశస్వీ

## అవయవదానంపై అవగాహన పెంచాలి

● అఖిల భారత శరీర, అవయవ దాతల సంఘ అధ్యక్షురాలు సీతామహాలక్ష్మి

మంగళగిరిసిటీ, ఆగస్టు 7: అవయవదానంపై ప్రజల్లో అవగాహన పెంచాలని అఖిల భారత శరీర అవయవదాతల సంఘం అధ్యక్షురాలు, సావిత్రీబాయి పూలే ఎడ్యుకేషనల్, చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ డాక్టర్ గూడూరు సీతామహాలక్ష్మి పిలుపునిచ్చారు. ఆగస్టు 1 నుంచి 15 వరకు జరుగనున్న జాతీయ అవయవదాన పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం మంగళగిరి మండలం ఆత్మకూరు గ్రామంలోని నిర్మల ఫార్మసీ కళాశాలలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. జాతీయ సేవా పథకం, అవయవ దాతల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులతో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ పీ.దివ్య తేజోమూర్తి ర్యాలీని ప్రారంభించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్లకార్డులను చేతబూని 'అమ్మ జన్మనిస్తుంది-అవయవ దానం పునర్జన్మనిస్తుంది, అవయవ దానం చేయండి-ప్రాణదాతలు కండి, అవయవ దానం చేయండి- ఎనిమిది మంది జీవితాల్లో వెలుగులు నింపండి' అంటూ నినదాలు చేశారు. ఆత్మకూరు జంక్షన్‌వరకు ప్రదర్శ నిర్వహించి అక్కడ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఏర్పాటుచేసిన అవగాహనా సదస్సులో డాక్టర్ సీతామహాలక్ష్మీ మాట్లాడుతూ.. అవయవదానం వలన మనిషికి పునర్జన్మ లభించినట్టవుతుందన్నారు. యువత సామాజిక దృక్పథం కలిగివుండి, అవయవ దానంపై సమాజాన్ని చైతన్య పరిచేందుకు కృషి చేయాలన్నారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానమిచ్చారు. అవయవ దానంపై విద్యార్థులకు పోస్టర్ మేకింగ్ కాంపిటీషన్ నిర్వహించగా, అందె భాగ్యశ్రీ ప్రథమ బహుమతి, ఎం.భార్గవి ప్రియ ద్వితీయ బహుమతులను సాధించారు. విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో శరీర అవయవ దాతల సంఘం ప్రతినిధులు డాక్టర్ రమణ యశస్వి, కొండవీటి నర్మద, నిర్మల ఫార్మసీ కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ జీ.నిర్మల జ్యోతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రేఖా నరేష్‌బాబు, ఆర్.నరసింహ నాయక్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కళ్ళం మోహనరెడ్డి, ఉమాశంకరెడ్డి తదితరులు

## అత్యున్నత ప్రమాణాలతో సాంకేతిక విద్య

● కళ్ళం ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాకర్ ఎం ఉమాశంకరరెడ్డి

గుంటూరు (విద్య), ఆగస్టు 7: సాంకేతిక విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాలతో విద్యా బోధన, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పన తమ ధ్యేయమని కళ్ళం ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ మువ్వా ఉమాశంకరరెడ్డి అన్నారు. బుధవారం చౌడవరంలోని కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఉమాశంకరరెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో ఈ ఏడాది 1200 మందికి పైగా విద్యార్థులు ఇంజనీరింగ్‌లో అడ్మిషన్ పొందారని తెలిపారు. వీరికి మెరుగైన బోధన, మౌలిక వసతులు అందిస్తున్నామని వివరించారు. కళాశాల చైర్మన్ కళ్ళం మోహనరెడ్డి ప్రసంగిస్తూ విద్యార్థుల అభ్యున్నతే ధ్యేయంగా కళాశాల పనిచేస్తుందన్నారు. వారి ఉజ్వల భవిష్యత్తుకు చక్కటి మార్గాన్ని వేసేందుకు అన్నివిధాలా కృషిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి, వైస్ చైర్మన్ పీ.వెంకటేశ్వరరెడ్డి, ఏవో కళ్ళం నవ్య, ఉపాధి కల్పనాధికారి డాక్టర్ పీఎల్ మాధవరావు, వివిధ విభాగాల హెచ్‌వోడిలు పాల్గొన్నారు.

## 49,224 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 47,647 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 49,224 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంకా యార్డు ఆవరణలో 19,421 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు తెలిపారు. వివిధ రకాల మిరప కాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

| వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర | వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర |
|---|---|---|---|---|---|
| నాన్ ఏసీ కామన్ వెరైటీ | | | ఏసీ కామన్ వెరైటీ | | |
| 334 | 8000 | 17000 | 334 | 8500 | 16000 |
| నెంబరు. 5 | 9000 | 15000 | నెంబరు. 5 | 10000 | 12500 |
| 273 | 9500 | 9500 | 273 | – | – |
| 341 | 8500 | 16500 | 341 | 9000 | 15000 |
| 4884 | 10500 | 15000 | 4884 | 9000 | 12000 |
| సూపర్ 10 | 16200 | 16200 | సూపర్ 10 | – | – |
| నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ | | | ఏసీ స్పెషల్ వెరైటీ | | |
| తేజ | 7500 | 18500 | తేజ | 9000 | 18500 |
| బ్యాడిగి | 8000 | 17000 | బ్యాడిగి | 9000 | 13000 |
| దేవనూరు డీలక్స్ | 11000 | 13500 | దేవనూరు డీలక్స్ | 9000 | 14000 |
| తెల్లకాయలు | 4500 | 11500 | తెల్లకాయలు | 5000 | 10500 |

# గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

## ప్రభుత్వ మహిళా కళాశాలకు మహర్దశ : నసీర్


మహిళా కళాశాల ప్రిన్సిపాల్‌కు పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): గుంటూరులోని ప్రభుత్వ జూనియర్ మహిళా కళాశాలకు మహర్దశ పడుతోందని ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. కళాశాలలో మరుగుదొడ్ల నిర్మాణానికి ఏఎస్ఎఫ్ఎఫ్ నిధులు వినియోగానికి ఆమోదం తెలుపుతూ ప్రభుత్వం జారీ చేసిన ఆర్డర్ కాపీని ప్రిన్సిపాల్ సునీతకు తన కార్యాలయంలో బుధవారం ఆయన అందజేశారు. నాడు-నేడు నిధుల ద్వారా మంజూరైన పనులు మధ్యలోనే ఆగిపోగా, వాటిని పూర్తి చేయుటకుగాను రూ.24 లక్షలు ఏఎస్ఎఫ్ఎఫ్ నిధులు వాడుకొనుటకు పరిపాలన విభాగం ఆమోదం ఇచ్చినట్లు ఆయన తెలిపారు. గతంలో నాడు- నేడు నిధులు ద్వారా 29 టాయిలెట్స్ నిర్మాణం చేపట్టగా, నిధులు కొరతతో పనులు మధ్యలోనే ఆగిపోయాయని పది రోజుల క్రితం కళాశాల సిబ్బంది ఎమ్మెల్యే నసీర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆయన విద్యాశాఖమంత్రి నారా లోకేశ్‌కు లేఖ రాయగా, మంత్రి స్పందించి రూ.24 లక్షలు ఏఎస్ఎఫ్ఎఫ్ నిధులు వాడుకోవడానికి అనుమతి ఇచ్చారని తెలిపారు.

## బీపీ మండల్ ఆశయసాధనకు సమష్టిగా కృషి చేయాలి

● బీసీ, దళిత సంఘాల నాయకులు పిలుపు


బీపీ మండల్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న దళిత, బీసీ నాయకులు

గుంటూరు(విద్య), ఆగస్టు 7: రాజ్యాధికారం దిశగా బలహీనవర్గాలు పోరాటం చేయాలని, సమాజంలో అణగారిన వర్గాలకు న్యాయం జరగాలంటే సమష్టి కృషి అవసరమని సీనియర్ న్యాయవాది వై కోటేశ్వరరావు(వైకే) స్పష్టం చేశారు. బుధవారం అమరావతి రోడ్డులోని బీపీ మండల్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీపీ మండల్ రిజర్వేషన్ల కోసం కృషి చేస్తుంటే ఎల్‌కే ఆద్వాని రథయాత్ర పేరుతో మందిర్ యాత్ర చేపట్టారని ఎద్దేవా చేశారు. దళిత, బీసీ వర్గాలు సమైక్యంగా కృషి చేస్తే రిజర్వేషన్ల అమలు జరుగుతాయని, బీపీ మండల్ ఆశయసాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సాదం సత్యనారాయణ, తమ్మెటి కృష్ణ, కె.సుబ్రహ్మణ్యం, తన్నీరు సాంబయ్య, దేవరాజ్, పోతురాజు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

## పెన్షనర్లలో పెరిగిన సంక్షిప్త సందేశాల వినియోగం

● ఈదర వీరయ్య

గుంటూరు, ఆగస్టు 7: పెన్షనర్స్‌లో సంక్షిప్త సందేశాలు రాజ్యమేలుతున్నాయని పెన్షన్‌దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరుగెడుతున్న ప్రపంచం వెనుక కీలక భూమిక వహిస్తున్నది సమాచార వ్యవస్థ అని, మారుతున్న కాలానికి అనుగుణంగా సమాచారం చేరవేసే ప్రక్రియలు కొత్త రూపు సంతరించుకుంటున్నాయన్నారు. ఒకప్పుడు సమాచారం చేరవేయాలంటే ఉత్తరం, లేదంటే టెలిఫోన్, ప్రస్తుతం ట్రెండ్ మారిందన్నారు. ప్రస్తుతం ఎస్ఎంఎస్‌ల హవా కొనసాగుతుందన్నారు. సమాచార వ్యవస్థలో సెల్‌ఫోన్ ముఖ్య భూమిక పోషిస్తుంటే, అందులో సంక్షిప్త సందేశాలది కీలకపాత్ర అన్నారు. సాంకేతిక పరిజ్ఞానం అందించిన సెల్‌ఫోన్ విప్లవం ఎంతో వేగంతో సమాచారాన్ని క్షణాల్లో అందరికీ చేరవేస్తుందన్నారు. సెల్‌ఫోన్‌లు వచ్చిన తొలినాళ్లలో అధిక శాతం సంభాషణలకే ఉపయోగించేవారు. ఇప్పుడు మాటల్లేవు, అన్ని సంక్షిప్త సమాచారాలేనని అన్నారు. అంతేకాకుండా వస్త్ర దుకాణాల్లో, బంగారు, ద్విచక్ర, కార్ల దుకాణాల్లో, ఆషాడం, శ్రావణం, రంజాన్, సంక్రాంతి, దీపావళి, దసరా, బక్రీదు, క్రిస్మస్ తదితర పండుగలకు ఇచ్చే ఆఫర్లను ఎస్ఎం ఎస్‌ల ద్వారా తెలియజేస్తూ ఎప్పటికప్పుడు వినియోగదారులతో సంబంధాలు కలిగి ఉంటున్నారన్నారు. ఎస్ఎంఎస్‌లు పంపటం ప్రస్తుతం రెండు విధానాల్లో కొనసాగుతుందన్నారు. ఒకటి సెల్‌ఫోన్‌లలో సమాచారాన్ని టైప్ చేసి, ఒకరికి, అంతకన్నా ఎక్కువ మందికి పంపటం, రెండోది ఒక సమాచారాన్ని అంతర్జాలం ద్వారా టైప్ చేసి అందరికి నెంబర్లకు పంపటం. రెండో విధానాన్ని ఎక్కువగా విద్యా, వ్యాపార సంస్థలు వినియోగిస్తున్నాయన్నారు. కంప్యూటర్‌తో కొన్ని వెబ్‌సైట్లలోకి వెళ్లి ఎస్ఎంఎస్‌లు ఉచితంగా పంపుకొనే అవకాశం కూడా ఉందని వీరయ్య తెలిపారు.

## ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో చేనేత ప్రదర్శన


ప్రదర్శనను తిలకిస్తున్న అధ్యాపకులు

గుంటూరు(విద్య), ఆగస్టు 7: చేనేత వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం చేనేత ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ జ్యోత్స్నకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా హ్యాండ్‌లూమ్ వాక్ నిర్వహించారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం ఏటా కళాశాలలో ప్రదర్శన ఏర్పాటు చేసి వస్త్రాలు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. కార్మికుల జీవితాల్ని ప్రతిబింబించేలా డ్యాక్యుమెంటరీ నిర్మించి, విద్యార్థినులకు పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## హెచ్ఐవీ పాజిటివ్‌లకు బీపీ స్ర్కీనింగ్ పరీక్షలు

గుంటూరు (మెడికల్) ఆగస్టు 7: ఏఆర్‌టీ చికిత్సలు వాడే హెచ్ఐవీ పాజిటివ్ వ్యక్తులు రక్తపోటు పరీక్షలు చేయించుకొని, బీపీ ఉంటే తప్పనిసరిగా వాటికి తగిన మందులు వాడాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ దాసరి శ్రీనివాసులు సూచించారు. బుధవారం అమరావతి రోడ్‌లోని ఛాతి, శ్వాసకోశ వ్యాధుల వైద్యశాలలోని ఎయిడ్స్ చికిత్సా కేంద్రంలో ఏఆర్‌టీ చికిత్సలు పొందే రోగులకు హైపర్‌టెన్షన్ స్ర్కీనింగ్ పరీక్షలను ఆయన ప్రారంభించారు. ఏఆర్‌టీ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ వెన్నెల మాట్లాడుతూ ప్రతి రోజూ ఏఆర్‌టీ మందుల కోసం వచ్చే వారికి బీపీ పరీక్షలతో పాటు హెపటైటిస్‌బీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హెపటైటిస్ బీ సోకుండా ముందస్తుగా టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐసీటీసీ కేంద్రాల జిల్లా సమన్వయకర్త జ్యోతుల వీరాస్వామి, షేర్ ఇండియా ప్రాజెక్ట్ ఆఫీసర్ రత్నకుమార్, ఏఆర్‌టీ సిబ్బంది పాల్గొన్నారు.

### యువకుడి అదృశ్యం

గుంటూరు, ఆగస్టు 7 : స్థానిక లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని నల్లచెరువుకు చెందిన వీశం సాయి (31) అదృశ్యమయ్యాడు. సాయి ఐటీసీకి చెందిన కార్తికేయ మార్కెటింగ్‌లో సేల్స్ మెన్‌గా పని చేస్తూ ఉంటాడు. మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో ఇంటి నుంచి ఆఫీసుకు వెళ్లాడు. మళ్ళీ ఇంటికి తిరిగి రాలేదని, ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుందని సాయి భార్య సౌజన్య క్రాంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు లాలాపేట పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## చేనేతల జీవన ప్రమాణాల మెరుగునకు కృషి

● జాతీయ చేనేత దినోత్సవంలో కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి



మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, పాల్గొన్న చేనేత శాఖ జిల్లా ఉన్నతాధికారులు వనజ, అనిల్ సాహు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 7: చేనేత పరిశ్రమ అభివృద్ధికి, చేనేత కళాకారుల జీవన ప్రమాణాల పెంపుదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలతో ప్రోత్సహిస్తుందని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. కలెక్టరేట్, ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో 10వ జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ జిల్లాలో మంగళగిరి, ఫిరంగిపురం, తెనాలి, పొన్నూరులలో చేనేత క్లస్టర్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముడిసరుకు కొనుగోలుకు ముద్రా, పీఎం జేజేబీవై, పీఎంఎబీవై, ఏజీ బీబీవై ద్వారా బ్యాంకుల ద్వారా రుణ సహాయం అందిస్తామన్నారు. జిల్లాలో మంగళగిరిలో ఇప్పటికే హ్యాండ్లూమ్ క్లస్టర్లు ఏర్పాటు చేశామని, వీటితో పాటు ఫిరంగిపురం, తెనాలి, పొన్నూరు ప్రాంతాల్లోను క్లస్టర్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. చేనేతకు సంబంధించి టెక్స్‌టైల్ ఇంజనీరింగ్ కోర్సు 100 సీట్లతో నల్లపాడులోని ఎంబీటీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలోను అందుబాటులో ఉందన్నారు. వీవర్స్ సర్వీస్ సెంటరు ఉప సంచాలకులు అనిల్ సాహు మాట్లాడుతూ ముద్రా రుణాలు చేనేత వస్త్రాల ముడిసరుకుకు 20శాతం నగదు చెల్లిస్తే వ్యక్తిగతంగా రూ.25 వేలు, సొసైటీలకు రూ.2 లక్షల వరకు అందిస్తారన్నారు. హెచ్ఎస్ఎస్ పథకం ద్వారా పదిశాతం నగదు చెల్లిస్తే 90శాతం ముడిసరుకుకు రుణం అందిస్తామన్నారు. చేనేత కుటుంబాల సంక్షేమం కోసం టెక్స్‌టైల్ ఇంజనీరింగ్ చదివే పిల్లలకు రూ.2 లక్షలు స్కాలర్‌షిప్ అందజేస్తామన్నారు. జిల్లా చేనత, జౌళి శాఖ జేడీ వనజ మాట్లాడుతూ జిల్లాలో రూ.1.7 కోట్లు చేనేత కళాకారులకు ముద్రా పథకం ద్వారా రుణాలు అందించామన్నారు. న్యూఢిల్లీలో జరిగిన చేనేత దినోత్సవం కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని సభలో ప్రదర్శించారు. కార్యక్రమంలో చేనేత కళాకారులు, సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీల విద్య, ఉపాధికి బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలి

● దళిత గిరిజన బడ్జెట్‌వాచ్ రాష్ట్ర కన్వీనర్ దేవకుమార్


సమావేశంలో మాట్లాడుతున్న దేవకుమార్, హాజరైన ప్రజా సంఘాల నాయకులు

గుంటూరు, ఆగస్టు 7: ఎస్సీ, ఎస్టీల విద్య, స్వయం ఉపాధికి 2024-25 బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలని దళిత, గిరిజన బడ్జెట్ వాచ్ రాష్ట్ర కన్వీనర్ అల్లడి దేవకుమార్ కోరారు. దళిత గిరిజన బడ్జెట్ వాచ్ జిల్లా సమావేశం బుధవారం గోరంట్లలోని డీబీఆర్‌సీ రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలను ఇంటర్మీడియట్‌లో అడ్మిషన్ల కోసం 12వేల సీట్లు అందుబాటులో ఉండగా, సుమారు 39 వేల దరఖాస్తులు ప్రతి ఏటా వస్తున్నాయని, అంటే 27వేలు మంది విద్యార్థులు గురుకులాల్లో చదువుకునే అవకాశం ప్రతీ సంవత్సరం కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వీరిలో బాలికలు డ్రాపౌట్స్‌గా మిగిలిపోతున్నారని, ప్రభుత్వం ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఏటా 20 కొత్త గురు కుల పాఠశాలలను నిర్మించి వాటికి అవసరమైన బడ్జెట్‌ను కేటాయించాలని కోరారు. ప్రతి జిల్లాలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోసం ఒక బాలుర, ఒక బాలిక రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలను నిర్మించి, అందుకోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో చదువుకున్న ఎస్సీ, ఎస్టీ రీసెర్చ్ స్కాలర్స్‌కి ఉపకార వేతన పథకాన్ని ప్రవేశ పెట్టాలని, కనీసం నెలకు రూ.30వేలు అంబేద్కర్ రీసెర్చ్ ఫెలోషిప్ పేరుతో పిలవాలన్నారు. అందుకు సంబంధించిన బడ్జెట్‌ను కేటాయించి ఉన్నతమైన విద్యకు ప్రభుత్వం తగిన నిర్ణయాన్ని తీసుకోవాలని కోరారు. డీబీఆర్‌సీ జిల్లా కన్వీనర్ మల్లెల చిన్నప్ప అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర కో ఆర్డినేటర్ బి.రమణమూర్తి, మహిళా ట్రైనింగ్ కో ఆర్డినేటర్ హేమలత, బందె ల రమేష్, వడ్డే రవితేజ, కూరపాటి నిర్మల, వివిధ ప్రజాసంఘాల నాయకులున్నారు.

## వైసీపీ పాలనలోనే ఉద్యోగులకు తీవ్ర నష్టం

● 8 శాతం పీఆర్‌సీ తగ్గింపు,
విద్య, వైద్యానికి పీఎఫ్ సొమ్ము వాడుకోలేని దుస్థితి
● చంద్రశేఖర్‌రెడ్డి వ్యాఖ్యలపై ఎన్జీవో నేతల ఆగ్రహం


సమావేశంలో మాట్లాడుతున్న ఎన్జీవో నేతలు శ్రీనివాసరావు, సతీష్‌కుమార్ తదితరులు

గుంటూరు, ఆగస్టు 7 : రాష్ట్ర చరిత్రలో ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయింది గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనేనని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఘంటసాల శ్రీనివాసరావు, శెట్టిపల్లి సతీష్‌కుమార్ స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ఎన్జీవో హోంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఏపీ ఎన్జీవో మాజీ అధ్యక్షుడు ఎన్ చంద్రశేఖర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. ఉద్యోగుల కోసం ఏపీ ఎన్జీవో సంఘం ఏర్పడి సుమారుగా 72 సంవత్సరాలు పూర్తి కావస్తోందని, ఈ మొత్తం కాలంలో ఉద్యోగులకు ఏదైనా తీవ్రమైన నష్టం జరిగిందంటే అది కేవలం గత ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలోనే అన్నారు. పీఆర్‌సీ ఫిట్‌మెంట్ 27 నుంచి 24 శాతానికి, హెచ్ఆర్ఏ 20 నుంచి 1 శాతానికి, పెన్షనర్లకు ఇచ్చే అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ 15 నుంచి 12శాతానికి ఇలా ప్రతి అంశంలోనూ రివర్స్ జరిగిందని ఆరోపించారు. ఉద్యోగులకు చెల్లించవలసిన డీఎలు, పీఆర్‌సీ సమయంలో పెంచి పీఆర్‌సీని 8 శాతం తగ్గించి మీకు జీతాలు పెంచాం చూసుకోండి అని బిల్లులు వేయ కుండానే ఉద్యోగులకు తగ్గించిన జీతాలు చెల్లించిన ఘనత గత ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఉద్యోగులు దాచిపెట్టుకున్న ప్రావిడెంట్ ఫండ్ డబ్బులు విద్య, వైద్య ఖర్చులకు ఉపయోగించుకోలేని సమయం ఏదైనా ఉంది అంటే గత ఐదు సంవత్సరాల్లోనే అని అన్నారు. జీతం ఒకటో తారీకు తీసుకోలేని రోజులు కూడా గత వైసీపీ ప్రభుత్వంలోనే ఉన్నాయన్నారు. పెన్షనర్లకు 15వ తేదీ వరకు పెన్షన్లు చెల్లించలేని స్థితి కూడా గత ప్రభుత్వంలోనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వెంక టరెడ్డి, కార్యనిర్వహక కార్యదర్శి ఏ శ్యాంసుందర్, నగర కార్యదర్శి సీహెచ్ కల్యాణ్‌కుమార్, విజయ్‌బాబు, ఎం శ్రీనివాసరావు, పత్తిపాడు తాలూకా అధ్య క్షుడు సీహెచ్ అనిల్‌కుమార్, కార్యదర్శి మారీలు తదితరులు హాజరయ్యారు.

## క్విట్ కార్పొరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

● రైతు, కౌలు రైతు సంఘాల నాయకుల పిలుపు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 7: క్విట్ ఇండియాడే సందర్భంగా ఈనెల 9న సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా క్విట్ కార్పొరేట్ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోనూ, అలాగే మండల కేంద్రాల్లో నిర్వహించాలని రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల సమన్వయ కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. బ్రాడీపేటలోని రైతు సంఘం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, ఏఐకే ఎస్ జిల్లా కార్యదర్శి శివాజీ, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు, కొల్లి రంగారెడ్డి పాల్గొన్నారు.

## రైతులకు సకాలంలో రుణాలివ్వాలి

● జేసీ భార్గవ్‌తేజ

గుంటూరు, ఆగస్టు 7: ప్రస్తుతం ఖరీఫ్ సాగుకు సంబంధించి రైతులకు సకాలంలో రుణాలందించాలని డీసీసీ బ్యాంకు అధికారులకు జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజ సూచించారు. డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జ్, జేసీ భార్గవ్‌తేజ బ్రాడీపేటలోని బ్యాంకు కార్యాలయాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా బ్యాంకు సీఈవో కృష్ణవేణి, ఇతర అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. రైతులకు రుణాలందించటంలో అధికారులు ఎక్కడా నిర్లక్ష్యం చేయవద్దన్నారు. ఈ సందర్భంగా ఆయన బ్యాంకులో బోగస్ రుణాలపై ఇటీవల మీడియాలో కథనాలపై ఆరా తీసినట్లు సమాచారం. బోగస్ రుణాల్లో బాధ్యులైన అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించినట్లు తెలిసింది. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు హాజరయ్యారు.


జేసీ భార్గవ్‌తేజకు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న సీఈవో కృష్ణవేణి తదితరులు

## ఘనంగా అఖిల భారత కాపు సంఘాల సమ్మేళనం


అఖిల భారత కాపు సంఘాల సమ్మేళనంలో పాల్గొన్న నేతలు

గుంటూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత కాపు సంఘాల సమ్మేళనం నగరంలో ఘనంగా జరిగింది. బుధవారం మధ్యాహ్నం స్థానిక శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో అమ్మా శ్రీనివాస్‌నాయుడు నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక, ఢిల్లీ తదితర రాష్ట్రాల నుంచి కూడా కాపు సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కృష్ణదేవరాయలు విగ్రహానికి పట్టాభిషేకం జరిపించారు. అమ్మా శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకృష్ణదేవరాయలు జయంతి, వర్ధంతి, పట్టాభిషేకం కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించాలని కోరారు. పార్లమెంట్ భవనంలో శ్రీకృష్ణదేవరాయలు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలానే ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం కాపు కులాల అభ్యున్నతికి పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయాలన్నారు. ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ కూడా హాజరయ్యారు.

## డబ్బా పాలు వద్దు.. తల్లీ పాలే ముద్దు

గుంటూరు (మెడికల్) ఆగస్టు 7: శిశువులకు తల్లిపాలే శ్రేష్ఠమైన ఆహారమని, డబ్బా పాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా బిడ్డకు తల్లే పాలు పట్టాలని ప్రభుత్వ సమగ్రాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వై.కిరణ్‌కుమార్ అన్నారు. తల్లిపాల ప్రోత్సాహక వారోత్సవాల ముగింపు సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ఆదర్శ్ ఆధ్వర్యంలో బుధవారం ప్రసూతి వార్డులో బాలింతలకు ఆయన దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ఆదర్శ్ అధ్యక్షురాలు వి.హిమబిందు, పూర్వ అధ్యక్షులు అశోక, రోహిణి, విజయవాణి, వాసవీ, వాణి తదితరులు పాల్గొన్నారు.

## కవులందరికీ మార్గదర్శి.. యుగకర్త గద్దర్

● ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ చింతకింది కాశీం


సమావేశంలో మాట్లాడుతోన్న ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ చింతకింది కాశీం

గుంటూరు, ఆగస్టు 7: గుమ్మడి విఠల్‌రావు (గద్దర్) పేద దళిత కుటుం బంలో పుట్టి ఉన్నత విద్య అభ్యసించి సాధారణ జీవితాన్ని కోరుకున్న యుగ కర్త అని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ చింతకింది కాశీం కొనియాడారు. చుండూరు అమరవీరుల 33వ వర్ధంతి, ప్రజాయుద్ధ నౌక గద్దర్ ప్రథమ వర్ధంతి సభని స్థానిక బ్రాడీపేటలోని సీపీఎం కార్యాలయంలోని కొరటాల హాల్లో దళిత బహుజన ప్రజాసంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో పాగళ్ల ప్రకాష్, గంటా ప్రభుదాసు, తాటికొండ నరసింహారావు అధ్యక్షతన నిర్వహించారు. తొలుత గద్దర్, మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాశీం మాట్లాడుతూ బి.నరసింగరావు సాహిత్యంలో కవిగా రూపుదిద్దుకుని సాహిత్య రంగంలో ఉన్నతమైన ఆదర్శనీయమైన కవిగా ఎదగటం గద్దర్ ప్రత్యేకత అని కొనియాడుతూ గద్దర్ పాటలను పాడి వినిపించారు. గద్దర్ పాట శైలి, పాట రచనా శైలి, వేష భాషా అన్నిటిలోనూ జానపద సాహిత్యాన్ని కొత్త పుంతలు తొక్కించాడన్నారు. కవులందరికి మార్గదర్శి, యుగకర్త గద్దర్ అని కాశీం కొనియాడారు. ఈ సభలో కవి సాహితీ విమర్శకులు జి.లక్ష్మీనరసయ్య, సామాజిక న్యాయ కేంద్రం కన్వీనర్ వైకే, మాజీ మంత్రి మాణిక్యవర ప్రసాద్, కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి కృష్ణ ప్రసంగించారు. పీవీ రమణ బృందం, కొల్లూరు నాగేశ్వరరావు గద్దర్ పాటలను ఆలపించారు.



## తీరు మార్చుకోకపోతే జగన్‌కు రాజపక్సే గతే

● కనపర్తి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు జగన్మోహనరెడ్డి తీరు మార్చుకోకపోతే శ్రీలంక మాజీ అధ్యక్షుడు రాజపక్సేకు పట్టిన గతే పడుతుందని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు హెచ్చరించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తనకు ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి భద్రతే ఉండాలని, ప్రజలివ్వని ప్రతిపక్ష హోదా తనకు ఇప్పించాలని న్యాయస్థానాల్లో పిటీషన్లు వేయడం జగన్ దిగజారుడు తనానికి నిదర్శనమని ఆయన ఎద్దేవా చేశారు. చంద్రబాబు అంబేద్కర్ రాజ్యాంగాన్ని గౌరవిస్తున్నారు కాబట్టే జగన్‌రెడ్డి ఆటలు ఇంకా కొనసాగుతున్నాయని చెప్పారు. ప్రతిపక్షనేత హోదాలో చంద్రబాబు రాజధాని ప్రాంతంతోపాటు నందిగామ, యర్రగొండపాలెం, కుప్పం, విశాఖపట్నం, తదితర ప్రాంతాల్లో పర్యటనలకు వెళితే ఆయనను తీవ్రంగా అవమానించి, రాళ్లదాడికి పాల్పడింది వైసీపీ రౌడీలు కాదా అని ప్రశ్నించారు. ప్రతిపక్షపార్టీ నేతల కార్యాలయాలు, ఇళ్లపైన దాడులకు తెగించిన జగన్‌రెడ్డి లాంటి ఫ్యాక్షనిస్టుకు ఎందుకు రక్షణ కల్పించాలని ప్రశ్నించారు. గన్నవరం విమానాశ్రయంలో చంద్రబాబుని రాష్ట్ర పోలీసులతో తనిఖీ చేయించి శునకానందం పొందిన చరిత్ర జగన్‌ది కాదా అని నిలదీశారు. విశాఖ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిని పెట్టకూడదని నీతిసూత్రాలు వల్లిస్తున్న జగన్, స్థానిక సంస్థల ఎన్నికల్లో కుప్పంతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ చేసిన అరాచకాలు, హత్యాయత్నాలు గురించి రాజకీయ పక్షాలు, ప్రజలు ఇంకా మర్చిపోలేదన్నారు. సమావేశంలో అడకా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాలు నివృత్తి చేస్తేనే ఉపాధ్యాయుల సర్దుబాటు

● డీఈవోకు ఏపీటీఎఫ్ నాయకులు విజ్ఞప్తి


డీఈవోకు వినతి పత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

గుంటూరు(విద్య), ఆగస్టు 7: ఉపాధ్యాయుల సర్దుబాటుపై అనేక అనుమానాలున్నాయని, వాటిని నివృత్తి చేసే వరకు ఈ ప్రక్రియ నిలిపివేయాలని ఏపీటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు కె.బసవలింగారావు, మహమ్మద్‌ఖాలీద్ స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం డీఈవో పి.శైలజకు వినతిపత్రం అందజేశారు. ఒకే క్యాడర్‌లో మిగులు ఉపాధ్యాయుల సీనియార్టీని ఎలా నిర్ధారిస్తారని ప్రశ్నించారు. అన్ని క్యాడర్ ఉపాధ్యాయుల మెరిట్‌కం రోస్టర్ సీనియార్టీ జాబితా అందుబాటులో లేదని దీని వల్ల ఇబ్బందులు వస్తాయని తెలిపారు. పాఠశాల స్థాయిలో సీనియర్, జూనియర్ అనే అసంబద్ధ నిర్ణయాలు సరికాదని ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని సంఘాలతో సమావేశాలు ఏర్పాటు చేసి, అనుమానాలు నివృత్తి చేసిన తరువాతే సర్దుబాటు ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వి.నాగశివన్నారాయణ, సత్యనారాయణమూర్తి, జి.దాస్, కిషోర్, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

## చేనేత కార్మికులకు జనసేన నేతల సన్మానం


చేనేత కార్మికులతో జనసేన పార్టీ నాయకులు

గుంటూరు, ఆగస్టు 7: జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకొని స్థానిక 56వ డివిజన్‌లోని వీవర్స్ కాలనీలో పలువురు చేనేత కార్మికులను జనసేన పార్టీ నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. చేనేత కార్మిక సంఘం నాయకులు గుర్రంచిన వీరయ్య, పున్నా గోపయ్య, సూర్యపల్లి వెంకటేశ్వర్లు, కే కృష్ణ, వెంకటేశ్వరరావులను సన్మానించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ భారతీయ వస్త్రకళకు ప్రాణం పోసే చేనేతను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. చేనేత కార్మికుల కష్టాలు, కన్నీళ్లు చూసి చలించిన జనసేనాని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తానే స్వయంగా చేనేతకు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నట్లు గుర్తు చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ నేతృత్వంలో చేనేత రంగానికి పూర్వ వైభవం చేకూరుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఆళ్ల హరి, పులిగడ్డ నాగేశ్వర రావు, సయ్యద్ షర్ఫుద్దీన్, ఆనంద్ సాగర్, కల్లగంటి త్రిపుర, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా మోర్చా ఆధ్వర్యంలో చేనేత దినోత్సవం


నేతన్నను సన్మానిస్తున్న బీజేపీ మహిళా మోర్చా నేతలు

గుంటూరు సిటీ, ఆగస్టు 7: జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరిలోని సీనియర్ నేతన్నగా పేరొందిన పొన్నబత్తుని లక్ష్మణరావు దంపతులను గుంటూరు మహిళా మోర్చా ఆధ్వర్యంలో సన్మానించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమానికి గుంటూరు మహిళా మోర్చా అధ్యక్షురాలు నడ్డి నాగమల్లేశ్వరి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సుమారు 100 మంది నేత కార్మికులకు ప్రధాన మంత్రి సురక్ష బీమా కింద పాలసీ చేయించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జోనల్ ఇన్‌చార్జి ఎస్ దయాకర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్రా శివన్నారాయణ, జిల్లా ఇన్‌చార్జి రామకృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర, డాక్టర్ శనక్కాయల అరుణ, ఉపాధ్యక్షులు సాధువాణి, తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు క్విజ్ పోటీలు

గుంటూరు(విద్య), ఆగస్టు 7: జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 8న టీజేపీఎస్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ నియంత్రాణాధికారి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్విజ్ పోటీలు టీజేపీఎస్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిగ్రీ విద్యార్థులకు(బాలికలు, బాలుర) అమరావతి రోడ్డులోని చిల్లీస్ క్రాస్‌రోడ్డు నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు పరుగు పందెం పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు టీజేపీఎస్ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్, డాక్టర్ జేవీ సుధీర్, ఫిజికల్ డైరెక్టర్ ఆర్ శివాజీలను (9849703144) సంప్రదించాలని సూచించారు.

## రేపటి వరకు పట్టాభిపురం ఎల్‌సీ గేటు మూసివేత

గుంటూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): అత్యవసర మరమ్మతుల నిమిత్తం ఈ నెల 9వ తేదీ వరకు పట్టాభిపురం(నెంబరు. 312) రైల్వే లెవల్ క్రాసింగ్ గేటుని మూసి ఉంచనున్నట్లు డీఆర్ఎం ఎం.రామకృష్ణ తెలిపారు. శుక్రవారం రాత్రి 7 గంటల వరకు ఈ గేటు మూసి ఉంటుందన్నారు. వాహనదారులు ప్రత్యామ్నాయంగా కంకరగుంట ఆర్‌వోబీ/ఆర్‌యూబీని రాకపోకలకు వినియోగించుకోవాలని సూచించారు. కాగా తరచుగా ఈ రైల్వే గేటుని మరమ్మతుల కోసం మూసి వేస్తుండటంతో వాహనదారులు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒకేసారి శాశ్వత మరమ్మతులు చేయాలని వారు కోరుతున్నారు. అలాగే నెంబరు. 307 నల్లపాడు-పేరేచర్ల మధ్య ఉన్న ఎల్‌సీ గేటుని ఈ నెల 8వ తేదీ రాత్రి 8గంటల వరకు మూసి వేసి ఉంచనున్నట్లు డీఆర్ ఎం తెలిపారు.

# రైట్ టు బి ఫర్గాటెన్ గోప్యత హక్కు!

**మనసుకు అయ్యే గాయాన్ని మాన్పే శక్తి కాలానికి ఉందంటారు. అయితే ఆ గాయాన్ని పదేపదే జ్ఞప్తికి తెస్తుంటే? ఒకవేళ చేయని నేరానికి బలైనవారిని, ఆ నేరం వారు చేయలేదని రుజువైనప్పటికీ ఒకప్పుడు నేరారోపణ చేయబడ్డాడని నిరంతరం ప్రచారం చేస్తుంటే? సదరు వ్యక్తులకు ఉన్న వ్యక్తిగత స్వేచ్ఛను, గోప్యత స్వేచ్ఛను ఉల్లంఘించినట్లు కాదా?**

ఇదే అంశం ఇటీవల ఒక కేసు రూపంలో సుప్రీం కోర్టు ముందుకు వచ్చింది. గతంలో లైంగికదాడి, మోసం కేసులో ఒక వ్యక్తిని దిగువ కోర్టు నేరస్థునిగా పేర్కొంటూ తీర్పుని ఇచ్చింది. అయితే తరువాత కాలంలో అతన్ని ఎగువకోర్టు నిర్దోషిగా ప్రకటించింది. కానీ లీగల్ సెర్చ్ పోర్టల్ 'ఇండియన్ ఖానూన్'లో దిగువకోర్టు ఇచ్చిన తీర్పు వివరాలు ప్రకటితమవుతుండటంతో సదరు వ్యక్తి దరఖాస్తు చేసుకున్న విదేశీ పౌరసత్వ అప్పీలును తిరస్కరించారు. ఈ ప్రకారం అతడు చేయని నేరానికి మళ్లీ మళ్లీ శిక్షించబడుతున్నట్లే. అదే అంశాన్ని ప్రస్తావిస్తూ ఆ వ్యక్తి మద్రాసు హైకోర్టును ఆశ్రయించి 'రైట్ టు బి ఫర్గాటెన్'(మరచిపోవు హక్కు)ను అభ్యర్థించాడు. ఇండియన్ ఖానూన్ పోర్టల్ నుంచి తనకు సంబంధించిన తప్పుడు సమాచారాన్ని తొలగించమని ఆదేశించాల్సిందిగా కోరాడు.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

ఈ నేపథ్యంలో మద్రాసు హైకోర్టు ఇండియన్ ఖానూన్ సం స్థను సదరు వ్యక్తికి సంబంధించిన సమాచారాన్ని తొలగించమని ఆదేశిస్తూ తీర్పునిచ్చింది. ఇండియన్ ఖానూన్ పోర్టల్ ఈ తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేసింది.

ఇటీవల సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ అధ్యక్షతన ముగ్గురు సభ్యుల ధర్మాసనం ఈ కేసును విచారణకు స్వీకరించడంతో రైట్ టు బి ఫర్గాటెన్' అనే హక్కుకు సంబంధించి కొన్ని నిర్ధారణలు వెలువడనున్నాయి. అసలు రైట్ టు బి ఫర్గాటెన్ అనేది ప్రాథమిక హక్కు అవుతుందా? ఒకవేళ అయితే, అది రాజ్యాం గం ప్రసాదించిన ఇతర ప్రాథమిక హక్కులతో ఏవిధమైన సంబంధం కలిగి ఉంటుంది? అనే అంశాలను దేశ అత్యున్నత న్యాయస్థానం పరిశీలించనుంది.

అసలు రైట్ టు బి ఫర్గాటెన్' అంటే ఏమిటి? ఎవరికి వర్తిస్తుంది? భారతదేశంలో దానికి గల చట్ట, న్యాయపరమైన పునాదులేవి? సదరు హక్కు లాభ - నష్టాలేమిటి? చూద్దాం.

### ● 'రైట్ టు బి ఫర్గాటెన్' అంటే?

అనవసరమైన లేదా అసందర్భమైన తన వ్యక్తిగత సమాచారాన్ని బహిరంగ సామాజిక వేదికల నుంచి అంటే ఇంటర్నెట్, సెర్చ్ ఇంజన్లు, డేటాబేస్‌లు, వెబ్‌సైట్లు, ఇతరత్రా ఏదైనా సమాచార మాధ్యమాల నుంచి తీసివేయించడానికి ఒక వ్యక్తికి గల హక్కునే రైట్ టు బి ఫర్గాటెన్ లేదా రైట్ టు బి ఎరేజర్ అంటారు.

ఒక వ్యక్తికి సంబంధించిన వ్యక్తిగత సమాచారాన్ని ఎటువంటి ఆవశ్యకత, చట్టపర అవసరం లేనప్పటికీ, అందరికీ బహిరంగంగా ఆ సమాచారాన్ని అందుబాటులో ఉంచి, అతని గోప్యతా హక్కును ఉల్లంఘించినప్పుడు ఒక వ్యక్తి రైట్ టు బి ఫర్గాటెన్(రీ) ఎరేజర్‌ను ఆశ్రయించే వీలుంది.

భారత్‌లో ఈ హక్కుకు ఇతిమిద్ధ రూపం లేనప్పటికీ, ఈయూ దేశాల్లో వారు తీసుకువచ్చిన 'జనరల్ డేటా ప్రొటెక్షన్ రెగ్యులేషన్(జీడీపీఆర్)' ఈ హక్కు ను వారికి అందిస్తోంది. అయితే దగ్గర కూడా కొన్ని తీర్పుల్లో, హక్కుల్లో, చట్టాలు, బిల్లుల్లో ఇది ప్రతిఫలిస్తోంది.

### ● భారతదేశంలో ప్రస్తావనలు

రైట్ టు బి ఫర్గాటెన్ అనే హక్కును, భారత రాజ్యాంగం కల్పిస్తున్న ప్రాథమిక హక్కుల్లోని, జీవించే హక్కు(ప్రకరణ 21)లో అంతర్భాగమైన గోప్యతా హక్కు పరిధిలోకి వచ్చే అంశంగా 'కె.ఎస్.పుట్టస్వామి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసు (2017) తీర్పులో ప్రస్తావించింది. అంతేకాక కొన్ని హైకోర్టులు(ఢిల్లీ, కర్ణాటక) కూడా వివిధ కేసుల్లో ఇంచుమించు ఇదేవిధమైన తీర్పులు ఇచ్చి ఉన్నప్పటికీ, సుప్రీం కోర్టు కె.ఎస్.పుట్టస్వామి కేసు తీర్పులో ఇచ్చిన ప్రాథమిక నియమావళి రైట్ టు బి ఫర్గాటెన్‌కు ఒక ప్రాతిపదికను ఏర్పర్చింది. న్యాయవ్యవస్థకు ఒక మార్గదర్శనం చేసింది.

## కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

ఇక చట్టాలపరంగా తీసుకుంటే 'డిజిటల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్ (2023)'లో రైట్ టు బి ఫర్గాటెన్‌కు ఒక చట్ట ప్రాతిపదిక కనిపిస్తుంది. వ్యక్తుల వ్యక్తిగత సమాచారాన్ని డిజిటల్ స్పేస్‌లో వారు నియంత్రించుకోగల సౌలభ్య అంశం ఈ చట్టంలో ఉంది. ఏ వ్యక్తి గురించిన వ్యక్తిగత సమాచారం డిజిటల్ స్పేస్‌లో అతడి/ఆమె వ్యక్తిగత గోప్యతకు, ప్రతిష్ఠకు, భద్రతకు నష్టం కలిగించేదిగా ఉన్నప్పుడు దానిని తొలగించమని డేటా నిర్వాహకులను కోరవచ్చు. వారు తొలగించని పక్షంలో రెగ్యులేటరీ అథారిటీ(లేదా) న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చు. అంతేకాక ప్రతిపాదిత పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లు (2019)లో కూడా రైట్ టు బి ఫర్గాటెన్ గురించిన ప్రతిపాదన ఉంది.

### ● పరిమితులు

సుప్రీంకోర్టు నిర్దేశనల ప్రకారం, ఒక వ్యక్తి వ్యక్తిగత సమాచారం ఎటువంటి చట్టపరమైన ఆవశ్యకతను కలిగి లేనప్పుడు, అవసరత, సంబంధం కానీ ఇతరత్రా లేనప్పుడు, అసత్యమైనప్పుడు దానిని తొలగించుకునే హక్కు ను సదరు వ్యక్తి పొందుతాడు.

అయితే భావవ్యక్తీకరణ హక్కుతో ముడిపడినప్పుడు, చట్టపరమైన అవసరాలు గల సమాచారమైనప్పుడు, ప్రజా ప్రయోజనాల సంబంధితమైనప్పుడు రైట్ టు బి ఫర్గాటెన్ వర్తించదని కూడా విస్పష్టం చేయడం జరిగింది.

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/TgHS0Wqలో చూడండి.

## దిక్సూచి

### లాభ నష్టాలు



ఢిల్లీ హైకోర్టు వ్యాఖ్యానించినట్లు రైట్ టు ప్రైవసీ(గోప్యతా హక్కు) అనేది రైట్ టు ఇన్ఫర్మేషన్(సమాచార హక్కు)తో సమన్వయం కావాలి. రైట్ టు బి ఫర్గాటెన్' ఎంత ఆవశ్యకమో, సమాచార స్వేచ్ఛ కూడా అంతే అవసరమనే వాద ప్రతివాదనలు ఉన్నాయి.

**లాభాలు**

- ★ నిరపరాధులు తమ గౌరవాన్ని కాపాడుకోవడానికి వీలవుతుంది.
- ★ సమాచారం తీవ్రంగా దుర్వినియోగం అవుతూ, అసత్యాలు, పాక్షిక సత్యాలు (ఉదా: ఫేక్ న్యూస్, రివేంజ్ పోర్న్, మార్ఫ్‌డ్ కంటెంట్) ప్రచారమవుతున్నఈ డిజిటల్ యుగంలో రైట్ టు బి ఫర్గాటెన్ వంటి హక్కులు వ్యక్తి గౌరవాన్ని, గోప్యతను, ప్రతిష్ఠను రక్షిస్తాయి.
- ★ వ్యక్తిగత భద్రత, స్వేచ్ఛపరంగా అనవసర సమాచారం అందరికీ సులువుగా అందుబాటులో లేకుండా, మోసాలు, ఐడెంటిటీ తెఫ్ట్ వంటి వాటికి గురవకుండా రక్షణ లభిస్తుంది.

**నష్టాలు**

- ★ రైట్ టు బి ఫర్గాటెన్ ఒక ప్రాథమిక హక్కుగా లభిస్తే, తరచూ మరికొన్ని చట్టబద్ధ/ ప్రాథమిక హక్కులైన సమాచార హక్కు, భావప్రకటన స్వేచ్ఛ, పరిశోధన, పాత్రికేయ స్వేచ్ఛలతో సంఘర్షణ ఏర్పడుతుంది.
- ★ సాంకేతికంగా డిజిటల్ సంస్థలకు ఎన్నో సవాళ్లు ఎదురవుతాయి. భారీఎత్తున సమాచారం నిరంతరం తొలగించాల్సిన పరిస్థితితో ప్రత్యేక యం త్రాంగం, సాంకేతికతల ఆవశ్యకత ఏర్పడుతుంది.
- ★ సెర్చ్ ఇంజన్లు ఇచ్చే సమాచారం విపరీతంగా కుంచించబడుతుంది. ఒక అంశంతో అనేక ఉప అంశాలు ముడిపడి ఉన్నప్పుడు వ్యక్తిగత స్వేచ్ఛ హక్కు కారణంగా అవి తొలగించాల్సి వస్తే సమాచారం అతుకుల బొంతగా తయారవుతుంది.
- ★ బ్లాక్‌చైన్ టెక్నాలజీ నేపథ్యంలో సమాచారాన్ని పూర్తిగా తొలగించడం, పునరావృతం కాకుండా చూడటం దుర్లభం.

ఇలాంటి వాదోపవాదాల/ లాభ-నష్టాల నేపథ్యంలో ప్రస్తుతం రైట్ టు బి ఫర్గాటెన్ అనేది ప్రాథమిక హక్కుల పరిధిలోకి వస్తుందా? ఒక హక్కుగా స్థిరీకరించి ప్రజలకు అందుతుందా అనే అంశాలతోపాటు ఇతర ప్రాథమిక హక్కుల పరిధిలోకి వెళ్లి సంఘర్షణ ఏర్పడినప్పుడు ఏమి చేయాలనే అంశాలు సుప్రీంకోర్టు పరిశీలనార్థం ఉన్న ఇండియన్ ఖానూన్ కేసు సముఖంగా తేలాల్సిందే.

---

## జగన్ అక్రమాస్తుల కేసులో..
# ఏమిటీ కాలయాపన?

(మొదటి పేజీ తరువాయి)

మార్గదర్శకాల ప్రకారం విచారణ సాగించాలని ఆదేశించింది. జగన్ అక్రమాస్తుల కేసు విచారణను వేగవంతం చేయాలని, కేసుల ట్రయల్‌ను తెలంగాణ నుంచి మరో రాష్ట్రానికి బదిలీ చేయాలని, జగన్ బెయిల్ రద్దు చేయాలని కోరుతూ టీడీపీ ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేయడం తెలిసిందే. వాటిపై ఈ ఏడాది మే 2న సీబీఐ అఫిడవిట్ వేసింది. 'కేసుల్లో నిందితులుగా ఉన్నవారు ఒకరి తర్వాత మరొకరు డిశ్చార్జ్ పిటిషన్లు వేస్తున్నారు. ట్రయల్ సాగకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారు. ఇప్పటివరకు 39 క్వాష్ పిటిషన్లు, 95డిశ్చార్జ్ పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై తీర్పులు ఇవ్వడానికి ముందే న్యాయాధికారులకు స్థానచలనం కలుగుతోంది. ఈ కేసులో ఉన్న నిందితులంతా శక్తిమంతులే' అని సీబీఐ అందులో పేర్కొంది. దీనిపై బుధవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్, జస్టిస్ ఆర్.మహదేవన్‌తో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. బెంచ్ ముందుకు మొదటి కేసుగా జగన్ అక్రమాస్తుల కేసుపైనే విచారణ జరగాల్సి ఉంది. అయితే.. అదనపు సొలిసిటర్ జనరల్ రాజు అందుబాటులో లేకపోవడంతో రెండో కేసు నుంచి విచారణను ప్రారంభించారు. నాలుగో కేసు విచారణ జరుగుతుండగా రాజు వచ్చి జగన్ కేసును ప్రస్తావించగా జస్టిస్ ఖన్నా అసహనం వ్యక్తం చేశారు. పేజీల కొద్దీ అఫిడవిట్ దాఖలు చేశారే తప్ప అందులో విషయమే లేదని, మధ్యాహ్నం 2 గంటలకు విచారణ చేస్తామని స్పష్టం చేశారు. తిరిగి విచారణకు వచ్చినప్పుడు మళ్లీ రాజు అందుబాటులో లేరని సీబీఐ తరఫు న్యాయవాదులు చెప్పడంతో జస్టిస్ ఖన్నా ఆగ్రహం వ్యక్తంచేశారు. సీబీఐ అఫిడవిట్‌లోని అంశాలు ఆశ్చర్యకరంగా ఉన్నాయని తెలిపారు. కోర్టుల ఆదేశాలు తప్పనే సాకుతో కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము కూడా అనేక పిటిషన్లు విచారించి డిశ్చార్జ్ చేస్తున్నామని.. తమకెలాంటి అవరోధాలు ఎదురు కావడం లేదని ధర్మాసనం తెలిపింది. డిశ్చార్జ్ పిటిషన్లకు, కేసు విచారణకు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం విచారణ చేపట్టాలని సీబీఐని ఆదేశించింది. తదుపరి విచారణను నవంబరు 11కు వాయిదా వేసింది.

### జగన్‌కు 'జెడ్ ప్లస్' భద్రత కల్పిస్తున్నాం: ఏజీ

అమరావతి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ భద్రతను కుదించలేదని, ఆయనకు జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత కల్పిస్తున్నామని అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ హైకోర్టుకు నివేదించారు. బులెట్ ప్రూఫ్ వాహనానికి విండ్ షీల్డ్ అమర్చడం పూర్తయ్యేవరకు మరో బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి ఈ వ్యవహారంపై పూర్తివివరాలతో కౌంటర్ వేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించారు. విచారణను 28కి వాయిదా వేశారు. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి బుధవారం ఆదేశాలిచ్చారు. సీఎం హోదాలో తనకున్న భద్రతను పునరుద్ధరించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ మాజీ సీఎం జగన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్. శ్రీరామ్ వాదనలు వినిపించారు. పిటిషనర్‌కు ఇచ్చిన బుల్లెట్ ప్రూఫ్ వాహనం అద్దంలో పగుళ్లు ఉన్నాయని, వెనుక తలుపు తెరుచుకోవడం లేదని వివరించారు. న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ... మాజీ ప్రధానులకు కల్పిస్తున్న భద్రత మాదిరిగానే మాజీ సీఎంలకు కూడా కల్పించే విషయాన్ని ప్రభుత్వం ఎందుకు పరిశీలించకూడదని ప్రశ్నించారు. ఏజీ దమ్మాలపాటి బదులిస్తూ... తీవ్రవాదుల ముప్పు ఉండటంతో ఎన్ఎస్‌జీతో భద్రత కల్పించారని, మాజీ సీఎంలకు భద్రత కల్పించే విషయంలో హోంశాఖ మార్గదర్శకాలు అనుసరిస్తున్నామని పేర్కొన్నారు. 2024 జూన్ 3నాటి భద్రత కల్పించాలని పిటిషనర్ కోరుతున్నారని, అప్పుడు ఆయన సీఎం అన్నారు. ప్రస్తుతం ఆ హోదాలో లేరని తెలిపారు. జగన్‌కు ఇచ్చిన బులెట్ ప్రూఫ్ వాహనానికి విండ్‌షీల్డ్ మార్చేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారని, త్వరలోనే మరమ్మతులు పూర్తిచేస్తారని చెప్పారు. అంతవరకూ జగన్‌కు కొత్త బులెట్ ప్రూఫ్ వాహనం సమకూరుస్తారని వెల్లడించారు. పిటిషనర్ తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో, రిమోట్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్‌లు ఉపయోగించే ప్రాంతాల్లో పర్యటించే సమయంలో కాన్వాయ్‌లో జామర్ ఏర్పాటు చేస్తామని, ఆ వివరాలను ఆయన భద్రతా సిబ్బందికి అందిస్తామని అన్నారు. వ్యాజ్యంపై విచారణ ముగిసిన అనంతరం జగన్ తరఫు సీనియర్ న్యాయవాది స్పందిస్తూ... ప్రమాదం ఎప్పుడెలా వస్తుందో ఎవరికీ తెలియదంటూ... బంగ్లాదేశ్‌లో జరిగిన ఘటనను ఉదహరించారు. న్యాయమూర్తి స్పందిస్తూ మన దేశంలో అలాంటి ఘటనలు జరిగవని తనకు పూర్తి నమ్మకం ఉందని పేర్కొన్నారు.

---



హోం మంత్రి అనితతో భేటీ అయిన వివేకానంద రెడ్డి కుమార్తె సునీత

# నా తండ్రి కేసులో న్యాయం చేయండి

- ▸▸ కూటమి సర్కారుకు వివేకా కుమార్తె విన్నపం
- ▸▸ హోం మంత్రి అనితను కలిసిన నర్రెడ్డి సునీత

అమరావతి/కడప, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): "నా తండ్రి హత్య కేసులో నాకు న్యాయం జరగలేదు. దోషులకు శిక్ష పడేలా నేను చేస్తున్న న్యాయ పోరాటానికి మీ సహకారం కావాలి. ఒక మహిళా మంత్రిగా నా బాధ అర్థం చేసుకోండి" అంటూ హోంశాఖ మంత్రి వంగలపూడి అనితను వైఎస్ వివేకానంద రెడ్డి కుమార్తె నర్రెడ్డి సునీత కోరారు. అమరావతి సచివాలయంలో బుధవారం సీఎం చంద్రబాబును కలిసేందుకు వచ్చిన సునీత.. ఆయన బిజీగా ఉండటంతో హోం మంత్రి అనితను కలిశారు. "మా నాన్న(వివేకా) చాలా మంచి వ్యక్తి. గొడ్డలితో నరికి చంపి గుండెపోటని చిత్రీకరించారు. దోషులకు శిక్ష పడటమే మా నాన్నకు అసలైన నివాళి. నా వేదన అర్థం చేసుకుని న్యాయ పోరాటానికి సహకరించండి" అని సునీత కోరారు. పోలీసులు కేసును నీరుగార్చేలా వ్యవహరించారని, నిందితులను అరెస్టు చేసేందుకు కర్నూలుకు వెళ్లిన సీబీఐ అధికారుల బృందానికి స్థానిక పోలీసులు సహకరించకుండా అప్పటి ప్రభుత్వ పెద్దలు ఆదేశాలు జారీ చేశారని వివరించినట్లు తెలిసింది. ఆమె విన్నపంపై స్పందించిన హోంమంత్రి అనిత.. "కేసు ఇప్పుడు సీబీఐ పరిధిలో ఉంది. మీకు న్యాయం జరిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం కావాలన్నా అందిస్తాం" అని బదులిచ్చారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్ర పోలీసులు హంతకులకు అండగా నిలిచారని, బాధితులకు న్యాయం చెయ్యకపోగా సీబీఐ దర్యాప్తు అధికారులపై కేసులు పెట్టారని సునీత తెలిపారు. అలాంటి పోలీసులపై చర్యలు తీసుకుని భవిష్యత్తులో పోలీసులు ఎవరూ ఇలాంటి అక్రమాలకు పాల్పడకుండా చూడాలని విన్నవించారు. "సాక్షుల్ని బెదిరించారు. నన్ను ఇబ్బంది పెట్టారు. అవమానించారు. కేసులు పెట్టారు. ఎన్ని అరాచకాలు చేశారో చెప్పలేను" అంటూ సునీత ఆవేదన వ్యక్తం చేశారు. వివేకా హత్య కేసులో తప్పు చేసిన పోలీసులతోపాటు హంతకులకు వంత పాడిన వారిపైనా చర్యలు తీసుకుంటామని అనిత స్పష్టం చేశారు.

### కేసును తప్పుదోవ పట్టించారు

హోం మంత్రిని కలిసిన తర్వాత వివేకా కుమార్తె సునీత బుధవారం సాయంత్రం కడప జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజును కలిశారు. హత్య కేసును తప్పుదోవ పట్టించేందుకు సీబీఐ అధికారులను బెదిరించడం, వారిపై కేసులు పెట్టడం వంటి అంశాలను వివరించినట్లు తెలిసింది. అధికారాన్ని అడ్డంపెట్టుకుని కేసులు, పిటిషన్లు వేస్తూ కేసును నీరు గార్చేందుకు ప్రయత్నించారని వివరించినట్లు సమాచారం. ఐదేళ్ల అధికారంలో ఉన్నది సొంత కుటుంబ సభ్యులే అయినా న్యాయం జరగలేదని అన్నారు. తప్పు చేసిన పోలీసులను వదిలి పెట్టొద్దని ఎస్పీ హర్షవర్ధన్‌రాజును ఆమె కోరినట్లు తెలిసింది.

---

# నేతన్నలకు అండగా ఉంటాం

- ▸▸ చేనేత వస్త్రంపై జీఎస్టీ రద్దు చేయిస్తా
- ▸▸ జాతీయ చేనేత దినోత్సవంలో చంద్రబాబు



అమరావతి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికుల ఆదాయం పెరిగేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. నేతన్నల జీవితాల్లో వెలుగులు వచ్చేవరకూ తమ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బుధవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా విజయవాడలో ఏర్పాటు చేసిన చేనేత స్టాళ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్మికుల కష్టాలు, మార్కెటింగ్‌లో ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ.. నేతన్నలకు ఏదీ ఇవ్వకుండా అన్నీ చేశానంటూ సాక్షి పత్రిక, టీవీలో 400 కోట్ల ప్రకటనలు ఇచ్చుకున్న జగన్ రెడ్డి, చేనేత రంగంపై 226 కోట్లు అప్పు పెట్టి వెళ్లారని అన్నారు. ఆప్కోలో కొనుగోళ్లు ఆపేశారని, సొంత మగ్గానికి మాత్రమే నేతన్న నేస్తం ఇచ్చి లక్షలాది మందికి అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కులవృత్తులే ఆస్తిపాస్తులుగా జీవిస్తున్న వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం తమ ప్రభుత్వం ఐదేళ్లలో 1.50 లక్షల కోట్లు ఖర్చు చేయబోతోందన్నారు. బీసీల రక్షణ కోసం తమ ప్రభుత్వం చట్టం తీసుకురాబోతోందని, చట్టసభల్లో రిజర్వేషన్ల కోసం పార్లమెంటులో పోరాటం చేస్తామని తెలిపారు. చేనేతలు అడిగిన దానికన్నా ఎక్కువే ఇవ్వాలని ఉన్నా.. ఖాళీ ఖజానా, పది లక్షల కోట్ల అప్పులు, ఏడాదికి 90 వేల కోట్ల వడ్డీలు తన ముందున్న పెద్ద సవాళ్లన్నారు. 16 వేలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేస్తున్నామన్నారు. ఇసుక ఉచితంగా ఇచ్చి భవన నిర్మాణ కార్మికులకు పని కల్పించామని, మరోవైపు సామాన్యుడు ఇల్లు నిర్మించుకోవడానికి సులభతరం చేశామని చెప్పారు. ఆర్థిక అసమానతలు తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నామని, పేదోడికి అండగా తెలుగుదేశం పార్టీ, ఎన్డీయే ప్రభుత్వం ఉంటాయని భరోసా ఇచ్చారు.

### చేనేతలకు ఆరోగ్య బీమా

'చేనేత వర్గాలకు ఆరోగ్య బీమా చేయిస్తాం. త్రిఫ్ట్ ఫండ్ ప్రభుత్వ వాటా 8శాతం నుంచి 16 శాతానికి పెంచుతాం. జీఎస్టీ కౌన్సిల్‌తో మాట్లాడి చేనేత వస్త్రంపై పన్ను రద్దు చేయిస్తా. కుదరకపోతే రీయింబర్స్‌మెంట్ ఇస్తా. టీడీపీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా చేనేతలు ఉన్న ప్రాంతాల్లో పార్టీ పెట్టినప్పటి నుంచి మెజారిటీ వస్తూనే ఉంది. ఇంతలా ఆదరించిన మిమ్మల్ని గుండెల్లో పెట్టుకుంటా. మీకు ఎంతచేసినా తక్కువే. ఇంట్లో మగ్గం కోసం ఆర్థిక చేయూత ఇస్తాం. ఆన్‌లైన్ వ్యాపారానికి సహకారం అందిస్తాం. ప్రధాని సూర్యఘర్ కింద 200 యూనిట్లు విద్యుత్ సొంతంగా వాడుకునేలా సోలార్ ఏర్పాటు చేయిస్తాం' అని ముఖ్యమంత్రి వరాలు కురిపించారు. ఏడాదికి 60-70 కోట్ల జీఎస్టీ భరించేందుకు మనసు రాని మాజీ ముఖ్యమంత్రి సర్వే రాళ్లపై ఫొటోలకు 700 కోట్లు, సొంత మీడియాకు 400 కోట్లు ఇచ్చుకున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సుజనా చౌదరి, గద్దె రామ్మోహన్, బోడె ప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావ్, ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప పాల్గొన్నారు.

### భువనేశ్వరి కోసం ఉప్పాడ, ధర్మవరం చీరలు

▸▸ చేనేత స్టాల్స్‌లో కొన్న చంద్రబాబు

ముఖ్యమంత్రి చంద్రబాబు తన సతీమణి కోసం షాపింగ్ చేశారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా విజయవాడలో ఏర్పాటు చేసిన చేనేత స్టాల్స్‌లో నారా భువనేశ్వరి కోసం చీరలు కొనుగోలు చేశారు. చేనేత స్టాళ్లను తిలకిస్తూ ముందుకెళ్లిన ముఖ్యమంత్రి రెండు స్టాల్స్ వెనక్కి వచ్చి 'ఈ చీరలు బాగున్నాయి.. ఎక్కడివి?' అని అడిగారు. ఉప్పాడ హ్యాండ్లూమ్ సొసైటీలో తయారైనవని అక్కడున్న నేత కార్మికుడు మల్లెల నాగేంద్రబాబు చెప్పారు. 'సరే ఆ చీర ఇవ్వు' అంటూ నెమలి రంగు పట్టు చీరను కొనుగోలు చేశారు. ఆ తర్వాత ధర్మవరం పట్టుచీరల స్టాల్‌కు వెళ్లి మరో చీర కొనుగోలు చేశారు. 'నా జీవితంలో ఎప్పుడూ చీరలు కొనలేదు. ఇప్పుడు మన చేనేత కళాకారులు తయారు చేసిన చీరలు చూడగానే ఆకట్టుకున్నాయి. అందుకే మా ఆవిడకు రెండు చీరలు కొనుగోలు చేశా. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు కొనాలి. నెలలో ఒక్క రోజైనా చేనేత వస్త్రాన్ని తప్పక ధరించాలి' అని ముఖ్యమంత్రి అన్నారు.

---

# బటన్‌రెడ్డికి బటన్ నొక్కి బుద్ధి చెప్పారు

▸▸ చేనేత దినోత్సవంలో మంత్రి సవిత

బాపట్ల, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి), మంగళగిరి సిటీ: రాష్ట్రాన్ని ఇప్పుడు కాపాడుకోకపోతే భావితరాల భవిష్యత్తుకు తామే ఉరివేసిన వాళ్లమవుతామన్న ఆలోచనతోనే జగన్‌రెడ్డికి వ్యతిరేకంగా బటన్ నొక్కి ప్రజలు బుద్ధి చెప్పారని చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత అన్నారు. బాపట్ల జిల్లా చీరాలలో బుధవారం జరిగిన జాతీయ చేనేత దినోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చీరాల కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరుకావాల్సి ఉందని, అయితే.. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో రాలేకపోయారని తెలిపారు. 2014-19 మధ్య చేనేత రంగానికి స్వర్ణయుగం లాంటిదని, గడచిన ఐదేళ్లలో దాచుకోవడం, దోచుకోవడం తప్ప జగన్ ఏమీ చేయలేదన్నారు. వైసీపీ ప్రభుత్వంలో చేనేత కార్మికులను ఆదుకోకపోగా వారి భూములను సైతం లాక్కున్నారని విమర్శించారు. వారు చేసిన భూ కబ్జాలకు ప్రొద్దుటూరులో కుటుంబం మొత్తం ఆత్మహత్యకు పాల్పడిందని తెలిపారు. గతంలో నూలుపై ఇచ్చిన సబ్సిడీని పునరుద్ధరించడంతో పాటు ఆప్కో ద్వారా రాయితీలు, ఆదరణ పథకాలు, నేత కార్మికులకు పెన్షన్, బీమా సౌకర్యం లాంటివన్నీ అమలు చేస్తామని మంత్రి చెప్పారు.



చీరాలలో నేత కార్మికుడి ఇంట్లోకి వెళ్లి సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి సవిత

చేనేత దినోత్సవంలో మాట్లాడిన మంత్రి సవిత ఓ దశలో భావోద్వేగానికి గురయ్యారు. తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన తనకు మంత్రి పదవి ఇచ్చేటప్పుడు.. "నా కుటుంబ సభ్యులైన చేనేతలను మీ చేతిలో పెడుతున్నా" అని మంత్రి లోకేశ్ చెప్పారని పేర్కొంటూ సవిత భావోద్వేగానికి లోనయ్యారు.

వైసీపీ అనుకూల పత్రికలో చేనేత రంగంపై బుధవారం ప్రచురితమైన ఓ కథనాన్ని సభలోనే చూపిస్తూ విషపు రాతలపై విరుచుకుపడ్డారు. కాగా, షెడ్యూల్ ప్రకారం చీరాల జాండ్రపేటలోని 3 చేనేత కుటుంబాలను సీఎం చంద్రబాబు కలుసుకోవాల్సి ఉంది. అననుకూల వాతావరణంతో రాలేకపోయారు. ఆ ఇళ్లకు మంత్రి సవిత వెళ్లా రు. జాండ్రపేటలోని వెంకటనాగేశ్వరరావు, నాగ య్య, యారంబరావు ఇళ్లకెళ్లి వారి ఇక్కట్లు తెలుసుకున్నారు.

### 'నేతన్న నేస్తం'లో అక్రమాలు

▸▸ మంత్రి సత్యకుమార్

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన చేనేత పరిశ్రమకు కూటమి ప్రభుత్వ హయాంలో పూర్వవైభవం తీసుకువస్తామని మం త్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో బుధవారం జరిగిన జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. 'నేతన్న నేస్తం'లో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయన్నారు. చేనేత వృత్తితో ఏమాత్రం సంబంధంలేని వైసీపీ కార్యకర్తలకు నేతన్న నేస్తం ఇచ్చారని ఆరోపించారు. వైసీపీ పాలనలో వందలాది మంది చేనేత కార్మికులు హత్యలు, ఆత్మహత్యలు, ఆకలి చావులకు గురయ్యారని ఆరోపించారు. వాటన్నింటినీ వైసీపీ ప్రభుత్వ హత్యలుగానే భావించాల్సి ఉంటుందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శారద, పక్కన సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్, అన్నపూర్ణ

## గర్భిణుల్లో రక్తహీనతను తగ్గించడమే లక్ష్యం

● సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్

తెనాలి రూరల్, ఆగస్టు 7: గర్భిణులలో రక్త హీనత శాతాన్ని తగ్గించి వారిని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు ఎనీమియా ముక్త భారత్ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్ చెప్పారు. బుధవారం మండలంలోని కొలకలూరులో దీనిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీ3 శారద సర్వీస్ సొసైటీ డాక్టర్ శారద, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణలు పాల్గొని ప్రసంగించారు. డాక్టర్ శారద మాట్లాడుతూ ఇటీవల కాలంలో గర్భిణులలో అధికశాతం ఎనీమియా (రక్తం తక్కువగా ఉండటం) కేసులు పెరుగుతున్నాయని తద్వారా వారు అనేక అనారోగ్య సమస్యల బారినపడి కాన్పు కష్టతరంగా మారుతుందన్నారు. తొలిలోనే దీనిని నివారించేందుకు ఈ నెల 9 నుంచి అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ ఎనీమియా బారిన పడకుండా ఆకుకూరలు, తాజాపండ్లు వంటివి క్రమం తప్పకుండా తీసుకుంటూ ఉదయం సాయంత్రం వేళ్లలో నడవటం అలవాటు చేసుకోవాలన్నారు. రక్తహీనత ప్రధాన లక్షణంగా చెప్పుకునే నీరసం, అలసట వంటి వాటిపై ప్రజలకు అవగాహన కల్పించి తద్వారా తక్షణవైద్యం పొందేలా చూడటమే ఈ కార్యక్రమ ముఖ్యఉద్దేశమన్నారు. కార్యక్రమంలో కొలకలూరు పీహెచ్‌సీ హెల్త్ ఆఫీసర్స్ డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ దిలీప్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, ఇతర సభ్యులు, ఏఎన్ఎమ్‌లు, ఆషా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్ శేషన్న

## పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించండి

● మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట ఆగస్టు 7: పట్టణంలో పారిశుధ్య పనులను క్రమం తప్పకుండా సక్రమంగా నిర్వహించాలని శానిటేషన్ అధికారులను పట్టణ మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. స్థానిక ఐతానగర్‌లోని 1వ వార్డులో బుధవారం జరుగుతున్న పారిశుధ్య పనులను పర్యవేక్షించి పారిశుధ్య కార్మికులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగు కాలువలలో వ్యర్థాలు, చెత్త వేయరాదన్నారు. డ్రెయిన్‌లను ఆక్రమించరాదన్నారు. పారిశుధ్య కార్మికులకు చెత్తను అందించాలన్నారు. అనంతరం 39వ వార్డులో జరుగుతున్న శానిటేషన్ పనులను పర్యవేక్షించి, సిబ్బందికి పలు ఆదేశాలను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## జేఎంజే కళాశాలలో జాతీయ చేనేత దినోత్సవం



పోటీలను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ సైనీ

తెనాలి అర్బన్, ఆగస్టు 7: జేఎంజే మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఫ్యాన్సీ డ్రెస్ పోటీలను ప్రిన్సిపాల్ సైనీ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ, నేత కార్మికులను ఆదరించేందుకు, ప్రోత్సహించేందుకు ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు కొనుగోలు చేయాలన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో విదేశీ వస్త్ర బహిష్కరణ, స్వదేశీ ఉద్యమం, చేనేత ప్రాధాన్యతను చాటి చెప్పాయని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు 2015 ఆగస్టు 7న చేనేత దినోత్సవం ప్రకటించారని చెప్పారు. భారతీయుల సంస్కృతి, సంప్రదాయాలను చేనేత వస్త్రాలు ఆభరణాలుగా నిలిచాయన్నారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ శారద, విజయలక్ష్మి, పాటిబండ్ల హేమలత, అమూల్ మేరి తదితరులు పాల్గొన్నారు.

## మాదిగల అభ్యున్నతికి పాటుబడతా

● ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు



నాగరాజును అభినందిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

తెనాలి రూరల్, ఆగస్టు 07:జిల్లా వ్యాప్తంగా మాదిగల హక్కులను కాపాడుతూ వారి అభ్యున్నతికి పాటుబడతానని నూతనంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన కిన్నెర నాగరాజు చెప్పారు. బుధవారం ఆయన జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయారు. మండలంలోని బుర్రిపాలెం గ్రామానికి చెందిన నాగరాజును పలువురు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు దుస్తులు పంపిణీ



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న పూర్ణచంద్

తెనాలి అర్బన్, ఆగస్టు 7: రూరల్ మండలం పెదరావూరులో బుధవారం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. గుమ్మడి వెంకటనారాయణ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈదర వెంకటపూర్ణచంద్, కన్నెగంటి మురళీకృష్ణ, నల్లూరి వెంకటేశ్వరరావు, కుర్రా శ్రీనివాసరావు, ఆదినారాయణ, వెంకటరత్నం, పోతురాజు, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



# మీరు రావద్దు... మేమే గ్రామాలకు వస్తాం

- ఏ రోజు పని ఆరోజు పూర్తిచేయాల్సిందే
- ప్రలోభాలకు ఆశపడి ఇబ్బందులు పెడితే సహించం
- సమస్యల పరిష్కారం కోసం గ్రామాలకే తహసీల్దార్
- వినూత్న తరహాలో 'జనం దగ్గరకి' శ్రీకారం
- కార్యాలయంలోనూ హెల్ప్ డెస్క్



పెదరావూరు పంచాయతీలో జనం సమస్యలను తెలుసుకుంటున్న తహసీల్దార్ గోపాలకృష్ణ, సిబ్బంది

తెనాలి, ఆగస్టు 7, (ఆంధ్రజ్యోతి): ఒక చిన్న పనికోసం జనాన్ని మన కార్యాలయాల చుట్టూ తిప్పుకోవటం మంచిపద్ధతి కాదు. ఎప్పటికైనా ఆ పని మనం చెయ్యాల్సిందే. అదేదో రోజుల తరబడి కాలయాపన కాకుండా ఏ రోజుపని ఆరోజే చేద్దాం. ఎక్కువ సమస్యలు, సంతకాలు చేయాల్సిన పరిస్థితి ఉంటే మీరు తెనాలి రావద్దు. మేమే మీ గ్రామానికి వస్తాం. బాధితులున్న గ్రామంలోనే కూర్చుని ఎక్కడా పెండింగ్ పనంటూ లేకుండా పూర్తిచేద్దామంటూ ఓ తహసీల్దార్ గ్రామంలోనే మకాంవేసి, పెండింగ్ పనుల పనిపట్టే వినూత్న పనికి శ్రీకారం చుట్టారు. ఇప్పటివరకు అధికారులే గ్రామాలకు వెళ్లిన చోట మాత్రం జనం నుంచి సంతోషం వ్యక్తమవుతోంది. నెలలు, సంవత్సరాల తరబడి పేరుకున్న సమస్యలకు పరిష్కారం చూపే దిశగా అడుగులు వేయటం విశేషం. దీనికితోడు తహసీల్దార్ కార్యాలయానికి పనికోసం వచ్చిన వారికి అధికారులు లేరని తిప్పి పంపకుండా, వారి పని విషయం తెలుసుకుని, సంబంధిత అధికారికి సమాచారం అందించేలా ఒక హెల్ప్ డెస్క్ ఏర్పాటు ఆలోచన చేయటం కూడా శుభపరిణామమే. తాజా బదిలీల్లో భాగంగా సూళ్లూరుపేట నుంచి తెనాలికి కొత్త తహసీల్దార్‌గా వచ్చిన గోపాలకృష్ణ నూతన విధానానికి శ్రీకారం చుట్టారు. వచ్చిన రెండోరోజు నుంచే గ్రామాల బాట పట్టారు. తహసీల్దార్ కార్యాలయంలో గత కొన్ని నెలలుగా పనులు పెండింగ్‌లో ఉండటం, ఫైల్స్ పేరుకుపోయి ఉండటంతో వాటిని వదిలించేందుకు సిద్ధమయ్యారు. తామే ఆ గ్రామాలకు వెళితే అక్కడే సమస్య పరిష్కారం అయిపోతుందికదా! అన్న ఆలోచనతో రెండు రోజుల నుంచి గ్రామాల్లోనే మకాం వేస్తున్నారు. ఎక్కువ ఫైల్స్ ఏ గ్రామానికి చెందినవి పెండింగ్‌లో ఉంటే ఆ గ్రామానికి ప్రాధాన్యం ఇస్తూ వస్తున్నారు. ఇప్పటివరకు తెనాలి మండలంలోని కొలకలూరు, హాఫ్‌పేట, నందివెలుగు, పెదరావూరు, జగ్గడిగుంటపాలెం గ్రామాల్లో సమస్యలపై దృష్టిపెట్టారు. మండలం మొత్తంమీద రైతులందరికీ ఓ కామన్ సమస్య ఉంది. 5808 సర్వేనంబర్‌లలో రైతుల భూములు అడంగల్ కాలం నంబర్ 6లో సమస్య ఉంది. ఈ కాలంలో భూమి స్వభావం కింద పట్టా లేక ప్రభుత్వ భూమి అని నమోదు కావలసి ఉంటే, దానికింద 'మాగాణి' అని పొరపాటున నమోదవటంతో ఆ రైతులు వారి భూములను అమ్ముకోటానికి వీలు కాని పరిస్థితి. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అసలు వారి రికార్డులే కనిపించకపోవటం దీనివల్ల ఏర్పడిన సమస్యే. దీని పరిష్కారం కోసం జనం తిరుగుతూనే ఉన్నారు. ఐనా ఈ సమస్య సంవత్సరం నుంచి పరిష్కారం కాకుండానేఉంది. ఈ సమస్య నమోదులోనే పొరపాటు జరిగిందని, దానిని పరిష్కరించటంకూడా మా బాధ్యతే కనుక వారంలో దీనికి పరిష్కారం చూపుతామని తహసీల్దార్ రైతులకు మాటిచ్చారు. అయితే వీటిలో 764 సర్వే నంబర్‌లు ఒక్క కొలకలూరు గ్రామంలోనే ఉండటంతో వాటిపై దృష్టిపెట్టారు. ఇదిలా ఉంటే... భూముల సర్వే, ఇతర వివాదాలు, పట్టాదారు పాస్ పుస్తకాలు, మరిన్ని ప్రభుత్వ పథకాలకు సంబంధించిన దరఖాస్తులు ఎక్కువగా ఉంటున్నాయని, వాటిని వెంటనే పరిష్కరిస్తున్నట్టు తహసీల్దార్ చెప్పారు. బుధవారం కూడా పెదరావూరు, జగ్గడిగుంటపాలెం పంచాయతీల్లో పెండింగ్ పనులను పరిష్కరించారు. ప్రస్తుతం చేస్తున్నది మేము చేయాల్సిన మా పనేనని, ఏవిధమైన అదనపు పనికి త్యాగం చేయటంలేదని, జనాన్ని ఇబ్బంది పెట్టకూడదనేదే నా ఉద్దేశమని గోపాలకృష్ణ విలేకరులకు వివరించారు. మా పనిని మాకున్న వెసులుబాటునుబట్టి చేసుకువెళ్లాల్సిందేనని, మా ఒత్తిడితో జనానికి సంబంధం లేదని, వారి సమస్యలు వారికి ఉంటాయని, అటువంటి వారిని రోజూ కార్యాలయాల చుట్టూ తిప్పటం కూడా మంచిదికాదని, అందుకే ఏ రోజు పని ఆరోజు పూర్తిచేయటం ఒక లక్ష్యంగా పెట్టుకుంటున్నామని, మాపై రాష్ట్ర మంత్రి మనోహర్ కానీ, ప్రభుత్వం కానీ పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవటమే మా ముందున్న లక్ష్యమని గోపాలకృష్ణ వెల్లడించారు.

### జనం కోసం హెల్ప్ డెస్క్

తహసీల్దార్ కార్యాలయానికి ఏదైనా పనిపై వచ్చిన వ్యక్తికి వీఆర్వో కానీ, ఆర్ఐ కానీ, తహసీల్దార్ కానీ అందుబాటులో లేకపోతే వెనుదిరిగి వెళ్లటం, మళ్లీమళ్లీ తిరగటం ఒక ప్రహసనమని, వారికి ఆ ఇబ్బందిలేకుండా చేసేందుకు ఒక హెల్ప్ డెస్క్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నట్టు తహసీల్దార్ గోపాలకృష్ణ చెప్పారు. ఎవరు వచ్చినా వారు ఎవరికోసం వచ్చారో! ఏపని కోసం వచ్చారో తెలుసుకుని సంబంధిత అధికారి లేకుంటే, వారికి ఫోన్ ద్వారా సమాచారం అందించి, ఎప్పుడు ఆ సమస్య పరిష్కారం అవుతుందనేది కూడా తక్షణమే తెలియచేసేలా సిబ్బంది సహకరిస్తారన్నారు. ఇది కాకుండా రోజు మొత్తంమీద పనులకోసం వచ్చివెళ్లినవారిలో కనీసం ఐదుగురుకు ర్యాండమ్ పద్ధతిలో స్వయంగా ఫోన్‌చేసి వారి పని విషయంలో అనుభవాన్ని, సంతృప్తి చెందారా! లేక ఎవరి వల్లయినా ఇబ్బందిపడ్డారా అనేది తెలుసుకుని ఆ పొరపాట్లు మళ్లీ జరగకుడా చూసుకుంటామని వివరించారు. మొత్తంమీద ఈ తరహా వినూత్న ప్రయోగం జనం నుంచి మన్ననలు అందిస్తోంది.

## స్వర్ణకారుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుంది

● మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్



ప్రమాణస్వీకార సభలో ప్రసంగిస్తున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి రూరల్, ఆగస్టు 7: స్వర్ణకారుల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెనాలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. బుధవారం పట్టణంలోని షరాఫ్‌బజార్‌లో జరిగిన శ్రీ కామాక్షి స్వర్ణకార సంఘం తెనాలి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగాపాల్గొన్నారు. నూతన అధ్యక్షుడిగా గొల్లపల్లి శ్రీనివాసరావు, సెక్రటరీగా షేక్ నాసర్ అహ్మద్, ట్రెజరర్‌గా మునగాల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా వీరమల్లు వీరభద్రయ్య, షేక్ హనీఫా, మునగాల ధనుంజయ, సహాయ కార్యదర్శులుగా వి.సాయి, సయ్యద్ ఫిరోజ్, బట్టు దుర్గప్రసాద్ పలువురు కార్యవర్గ సభ్యులచే కమిటీ పెద్దలు ప్రమాణస్వీకారం చేయించారు. వారికి మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ శుభాకాంక్షలు తెలిపి సంఘం తరుపున ప్రతి ఒక్కరికీ అండగా నిలవాలని ఆయన సూచించారు.

కార్యక్రమంలో పలువురు సంఘ సభ్యులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన తల్లిపాల వారోత్సవాలు

తెనాలి, మారీసుపేట ఆగస్టు 7: తెనాలి డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్న తల్లిపాల అవగాహన వారోత్సవ కార్యక్రమాలు ముగిశాయి. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో బుధవారం తల్లిపాల వారోత్సవ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీడీపీవో, ఐసీడీఎస్ ప్రాజెక్టు డాక్టర్ ఎం.సునీత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సంవత్సరం అంతరాలు లేకుండా తల్లిపాలను ప్రోత్సహించడం అనే కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు గంటలోపు పట్టించుట వలన ఆ పాలు బిడ్డకు మొదటి వ్యాధి నిరోధక టీకాలా పనిచేస్తుందని అన్నారు. తల్లి పాలలో వ్యాధి నిరోధక శక్తిని ఎక్కువగా కలిగిఉంటాయని తెలిపారు. అలాగే బిడ్డకు ఆరు నెలలు వచ్చేవరకు తల్లిపాలు పట్టించాలని, ఆరు నెలల తరువాత అదనపు ఆహారాన్ని ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవోలు ఎ సులోచన, ఎస్ వెంకటరత్నం, సుజాత, ఏసీడీపీవోలు సరిత, విజయకుమారి, డీసీపీవో విజయ్‌కుమార్, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### తల్లిపాలు అమృతం: జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్

తెనాలి రూరల్, ఆగస్టు 7: బిడ్డకు తల్లిపాలు అమృతంలా పనిచేస్తాయని ప్రతి తల్లి బిడ్డకు తప్పని సరిగా పాలు పట్టించి వారిలో రోగనిరోధన శక్తిపెంచేలా చూడాలని తెనాలి జిల్లా ప్రభుత్వవైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి చెప్పారు. బుధవారం పట్టణంలోని జిల్లా ప్రభుత్వవైద్యశాల్లో తల్లిపాల వారోత్సవాలు ముగింపు సభను నిర్వహించారు. పలువురు వైద్యశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 11న జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం ప్రమాణ స్వీకారం

తెనాలి అర్బన్, ఆగస్టు 7: జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం ప్రమాణ స్వీకారం ఈ నెల 11న ఆదివారం జరుగుతుందని సంఘ అధ్యక్షుడు కొప్పురావూరి హరికిషోర్ చెప్పారు. బోసురోడ్డులోని శ్రీవాసవీ ఆలయ ఆవరణలో బుధవారం ప్రమాణ స్వీకారోత్సవ సభ కరపత్రాలను ఆవిష్కరించారు. పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, పేదలకు వడ్డీలేని రుణాలు అందిస్తామన్నారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ గౌరవ అధ్యక్షునిగా కర్పూరపు రఘునాథమూర్తి, అధ్యక్షునిగా కొప్పురావూరి హరికిషోర్, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, సహకార్యదర్శులు ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. వాసవీ యూత్ ప్రమాణ కార్యక్రమం కూడా దీంతో పాటు జరుగుతుందన్నారు.

## గోదాదేవికి 101 ప్రసాదాల సమర్పణ



గోదాదేవికి సమర్పించిన నూటొక్క ప్రసాదాలు

తెనాలి రూరల్ ఆగస్టు 7: గోదాదేవి అమ్మవారి జయంతి సందర్భంగా బుధవారం నూటొక్క నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు జరిపారు. గోదాదేవి అమ్మవారి జయంతిని పట్టణంలోని శరణాగతి గోష్ఠి పీఠంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నరేంద్రరామానుజస్వామి మాట్లాడుతూ గోదాదేవి అమ్మవారిని నిత్యం పూజించే భక్తులకు సకల శుభాలు కలుగుతాయన్నారు. కార్యక్రమంలో తన్నీరు సీతారామాంజనేయులు, నాగేంద్రయ్య, శివయ్యమాస్టారు, విష్ణుమొలకల విజయలక్ష్మి పరిసర ప్రాంతాల భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమంలో అన్నదానం

తెనాలి, మారీసుపేట ఆగస్టు 7: పట్టణంలో వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని శ్రీవెంకటేశ్వర యోగ సేవ కేంద్రం సభ్యులు నిర్వహించారు. స్థానిక గాంధీనగర్‌లోని శ్రీషిరిడి సాయి వృద్ధాశ్రంలో బుధవారం ఎస్‌వీ యోగా సభ్యుడు కన్నెగంటి నరేంద్రకుమార్ పుట్టిన రోజు సందర్భంగా వారి తల్లి, తండ్రి కన్నెగంటి పిచ్చయ్య, సుశీల, భార్య కీర్తి, కుటుంబ సభ్యులు పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌వీ యోగా కన్వీనర్ ముద్దాభక్తుని రమణయ్య, సరయు, శ్రేయాస్, యోగ సాధకులు పాల్గొన్నారు.

## ఉద్యాన శాఖ కార్యాలయానికి తాళాలు

● తెనాలి మండలంలో రైతులకు ఆ శాఖ సేవలు నిల్



తెనాలిలో తాళం వేసి ఉన్న ఉద్యాన అధికారి కార్యాలయం

తెనాలి రూరల్, ఆగస్టు 7: వైసీపీ ప్రభుత్వ పాలనలో ఉద్యానవన శాఖకు గ్రహణం పట్టింది. తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డులో వ్యవసాయశాఖ కార్యాలయానికి అనుకుని ఉద్యాన వనరుల అభివృద్ధి కేంద్రం, ఉద్యాన వనశాఖ కార్యాలయం ఉంది. దీని ద్వారా మండలంలోని రైతులకు ఉద్యాన వన పంటలపై అవగాహన, సాగుమెలకువలు, పంట ఉత్పత్తులు అమ్మకాలు, విపత్తుల సమయంలో నష్టపరిహారం అంచనా వంటివి ఈ శాఖ కార్యాలయం నుంచి గతంలో సాగేవి. వైసీపీ అధికారం చేపట్టిన తరువాత జిల్లాల విభజనలో భాగంగా ఇక్కడ ఉన్న అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ అధికారిని జిల్లా కేంద్రానికి బదిలీచేశారు. ఇతర సిబ్బందిని వివిధ ప్రాంతాలకు పురమాయించారు. ప్రస్తుతం ఈ కార్యాలయంలో హెచ్‌వో (హార్టికల్చర్ ఆఫీసర్)ను మాత్రమే నియమించారు. మిగిలిన గ్రామాల్లో అంగలకుదురుకు ఒక వీహెచ్ఏను నియమించి సరిపెట్టారు. మిగిలిన గ్రామాలకు ఎటువంటి అధికారులను నియమించలేదు. వైసీపీ తీసుకున్న నిర్ణయంతో ప్రస్తుతం కార్యాలయానికి ఉన్న ఒక్క అధికారి మండలం మొత్తం సందర్శించాల్సి ఉంటుంది. ఈ అధికారి కూడా కార్యాలయానికి తాళాలు వేసి వెళ్లడంతో రైతులు నిరాశగా వెనుతిరిగి వెళుతున్నారు. కార్యాలయ డోర్‌లకు మాత్రం అధికారి ఫోన్ నెంబరు వేసి ఉండగా వానలకు తడిసి అదికూడా సరిగా కనిపించడంలేదు. ప్రస్తుతం సాగు సమయం ఆసన్నమవ్వడంతో రైతులకు సాగుసూచలను, సలహాలు ఇచ్చే యంత్రాంగం లేకపోవడంతో అన్నదాతలు నిరాశగా ఉన్నారు. కూటమి ప్రభుత్వమైనా హార్టికల్చర్ సేవలు రైతులకు అందేలా చూడాలని పలువురు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి: ఎంవీఐ

తెనాలి క్రైం, ఆగస్టు 7: విద్యార్థులను పాఠశాలలకు తీసుకువెళ్ళే ఆటో డ్రైవర్లు నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని మోటారు వాహన తనిఖీ అధికారి రాఘవరావు తెలిపారు. బుధవారం ఆర్టీవో కార్యాలయం వద్ద జరిగిన ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మోటారు వాహన నిబంధనల మేరకు స్కూల్ ఆటోలలో 12సంవత్సరాల వయస్సు లోపు విద్యార్థులను ఆరుగురికి మించి ఎక్కించుకోకూడదన్నారు. స్కూల్ బ్యాగులు, లంచ్‌బాక్సులు ఆటో సైడ్‌కి వేలాడదీయవద్దన్నారు. స్కూల్ యాజమాన్యం కూడా డ్రైవర్ల పనితీరును ఎప్పకటివ్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంవీఐ-2 మధుసూధనరావు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## చేబ్రోలులో 93.8 మి.మీ. వర్షం

పొన్నూరు టౌన్, చేబ్రోలు, ఆగస్టు 7: ఖరీఫ్ పంటల సాగు ప్రారంభంలోనే విస్తారంగా వర్షాలు కురవడంతో అన్నదాతల్లో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. బుధవారం పొన్నూరులో 13.2 మి.మీ వర్షపాతం నమోదు అయింది. చేబ్రోలులో 93.8మి.మీ వర్షపాతం నమోదు అయింది. ప్రస్తుతం పొన్నూరు, చేబ్రోలు మండలాల్లో ఖరీఫ్ పంటల సాగు విస్తృతంగా సాగుతుంది. ప్రధానంగా వరి సాగుకు వర్షపాతం ఆవశ్యకత ఉన్న నేపథ్యంలో వర్షాలు కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షాలకు వాతావరణం చల్లబడడంతో పాటు పంట భూములకు అవసరమైన నీరు సమృద్ధిగా అందుబాటులోకి వచ్చింది. వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో రైతులు విస్తృతంగా వరి నాట్లు సాగు చేస్తున్నారు. అంతే కాకుండా ఈ వర్షాలు మెట్ట పంటలైన కూరగాయలు, ఇతర వాణిజ్య పంటలకు కూడా మేలు చేస్తుందని మెట్ట ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## బాల్య వివాహాలను అరికడతాం

● సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్

తెనాలి, మారీసుపేట ఆగస్టు 7: ప్రజలను చైతన్యపరచి బాల్య వివాహాలను నివారిద్దామని సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ అన్నారు. పట్టణంలో మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్‌హాల్‌లో బుధవారం సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ ఆధ్వర్యంలో తెనాలి రెవెన్యూ డివిజన్ స్థాయిలో మండల స్థాయి చైల్డ్ మ్యారేజ్ రూల్స్ -2023, డిస్ట్రిక్ ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్మెంట్ ఏజెన్సీ వారి సహకారంతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీడీపీవో ఏ సునీత అధ్యక్షతన ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పాల్గొన్నారు. కమిషనర్ శేషన్న మాట్లాడుతూ బాల్య వివాహల నివారణలో లైన్ డిపార్ట్‌మెంట్స్ అందరి బాధ్యత ఉంటుందని తెలిపారు. డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి సీహెచ్ విజయ్‌కుమార్, లీగల్, ప్రొఫెషన్ అధికారి బి వాసంతి, సీఆర్ఏఫ్ స్టేట్ కో ఆర్డినేటర్ సమీర్‌కుమార్, మున్సిపల్ ఆరోగ్య అధికారి డాక్టర్ హెలెన్ నిర్మల, మండల మెజిస్ట్రేట్ కె గోపాలకృష్ణ తదితరులు పలు విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంసీడీవో శిల్ప, సీపీడీవోలు ఎం.సునీత, ఎస్ వెంకటరత్నం, సుజాత, ఏసీడీపీవోలు, రెవెన్యూ డివిజన్ అధికారులు, ఎంఆర్‌వోలు, ఎంపీడీవోలు, ఎంఈలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, చైల్డ్ వెల్ఫేర్ పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మెప్మా పీడీ వెంకటేశ్వర్లు

## పొదుపు రుణాల మంజూరులో జాగ్రత్తలు పాటించాలి

● మెప్మా పీడీ వెంకటేశ్వర్లు

పొన్నూరు టౌన్, ఆగస్టు 7: డ్వాక్రా మహిళలకు బ్యాంక్ లింకేజ్ రుణాలు మంజూరు చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాని మెప్మా పీడీ వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో మెప్మా విభాగం పరిధిలో బ్యాంకర్ల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన పీడీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇటీవల పొన్నూరు మెప్మా పరిధిలో వెలుగుచూసిన బోగస్ గ్రూపులు, అక్రమ రుణాల విషయం బ్యాంకర్ల దృష్టికి తీసుకువచ్చారు. బ్యాంకర్ల రుణాలు మంజూరు చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. రుణాలు పొందే మహిళల ఆధార్, సేకరణతో పాటు ఆన్‌లైన్‌లో వారి రుణ వివరాలను తెలుసుకోవాలన్నారు. అలాగే ఒక బ్యాంక్ నుంచి మరో బ్యాంక్‌కు పొదుపు మహిళలు మారే సమయంలో పాత బ్యాంక్‌ల ఎన్‌వోసీలు కోరాలని సూచించారు. అలాగే ఇప్పటికే ఆరోపణలు ఎదుర్కొంటున్న పొదుపు సంఘాల వివరాలు ఎస్‌పీపీ గ్రూపుల వివరాలను తెలియజేయాలని కోరారు. ఈ సందర్భంగా బ్యాంకర్‌లు మాట్లాడుతూ డ్వాక్రా రుణాల మంజూరు సమయంలో గ్రూపు ఖాతాలో నగదు జమచేసి అక్కడ నుంచి మహిళల వ్యక్తిగత ఖాతాల్లోకి నగదు బదిలీ అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. కొన్ని సంఘాలలో కొందరు సభ్యులు రుణాలు చెల్లించకుండా ఇబ్బందులు పెడుతున్నందున వారిని తొలగించే మార్గాలను సూచించాలని కోరారు. డ్వాక్రా రుణాలు మంజూరు సమయంలో ఆర్‌పీలతో పాటు సీవోను సీఎంఎం ధృవీకరణ తప్పనిసరి చేయాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సీఎంఏ నయీంఅహ్మద్, పట్టణంలోని బ్యాంకర్‌లు, పాల్గొన్నారు.

## అధిక కట్నం కోసం వేధిస్తున్న భర్త, అత్తపై కేసు

తెనాలి రూరల్, ఆగస్టు 7: భర్త, అత్త అధిక కట్నం కోసం వేదిస్తున్నారంటూ ఓ మహిళ ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని కొలకలూరు గ్రామానికి చెందిన కొప్పుల మానసకు చినపరిమికి చెందిన అవుతు పోతురెడ్డితో 2022వ సంవత్సరంలో వివాహం జరిగింది. వీరికి ఒక బాబు కూడా ఉన్నాడు. వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించే పోతురెడ్డి అతడి తల్లి గత కొంత కాలంగా అధిక కట్నం తీసుకురావాలని మానసను వేదింపులకు గురిచేస్తున్నారు. వీరి వేదింపులు తట్టుకోలేక ఆమె పుట్టింటికి వచ్చింది. వేదింపులపై బుధవారం భర్త, అత్తలపై రూరల్‌పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కోటేశ్వరరావు వెల్లడించారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● మండల వైద్యాధికారి ప్రియాంక



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న మండల వైద్యాధికారి ప్రియాంక

కొల్లిపర, ఆగస్టు 7: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి వేముల ప్రియాంక అన్నారు. బుధవారం మండల పరిధిలోని మున్నంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు ప్రత్యేక క్యాంపు నిర్వహించారు. వైద్యాధికారులు రోగులకు సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కాచిచల్లార్చిన నీటిని తాగటం మంచిదన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండటం వలన మన ఆరోగ్యానికి భద్రత కలుగుతుందన్నారు. గ్రామస్థులు తాగునీటి పంపుల వద్ద మురుగునీరు నిల్వఉండకుండా చూసుకోవాలన్నారు. మురుగునీరు వలన అంటువ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో వీహెచ్ఎన్ సుమతి, హెల్త్ అసిస్టెంట్ గంగవరపు శ్రీనివాసరావు, ఏఎన్ఎంలు, ఆషా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



బోనస్ పంపిణీ చేస్తున్న సంగం డెయిరీ డైరెక్టర్ రామారావు

## 76 మంది రైతులకు బోనస్ పంపిణీ

పొన్నూరు టౌన్, ఆగస్టు 7: రైతు సంక్షేమమే సంగం లక్ష్యమని ఆ సంస్థ డైరెక్టర్ రామారావు అన్నారు. మండల పరిధిలోని కొండమూడి గ్రామంలో బుధవారం పాల రైతులకు బోనస్ పంపిణీ కార్యక్రమం జరిగింది. 76మంది పాల రైతులకు వందకు 6రూపాయల చొప్పున రూ.1,16,403 బోనస్‌ను అందజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రామారావు మాట్లాడుతూ సంగం పాలకవర్గం రైతుల అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు. సంగం ప్రగతిలో భాగస్వాములైన రైతులకోసం చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ డీవీసీ అభయ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ పథకాలను పాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అప్పికట్ల చిల్లింగ్ సెంటర్ మేనేజర్ కాట్రా నరేష్‌బాబు, సంగం సూపర్‌వైజర్ బాలకృష్ణ, సొసైటీ అధ్యక్షుడు తాటివాక చెన్నయ్య, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీలపై దమనకాండ అమానుషం: పూమాటి

పొన్నూరు టౌన్, ఆగస్టు 7: చత్తీస్‌ఘడ్‌లో ఆదివాసీలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సాయుధ బలగాలు సాగిస్తున్న దమనకాండ అమానుషమని రాష్ట్ర పౌరహక్కుల సంఘం కోశాధికారి డాక్టర్ పూమాటి రాజారావు ఆరోపించారు. స్థానిక మానవ హక్కుల వేదిక కార్యాలయంలో బుధవారం అఖిల భారత ఆదివాసీల సదస్సు కరపత్రాలను ప్రజా సంఘాల నాయకులు ఆవిష్కరించారు. డాక్టర్ రాజారావు మాట్లాడుతూ పలు సమస్యలపై ఈ నెల 9, 10 తేదీలలో హైదరాబాద్ బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అఖిల భారత సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సదస్సుకు ప్రజా సంఘాలు, ప్రజాస్వామ్యవాదులు తరలివచ్చి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకుడు జీఎస్ రాయల్, కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కే కృష్ణ, దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమ రాష్ట్ర కమిటీ సభ్యుడు తమలపాకుల సుబ్బారావు, బలగాని వెంకటేశ్వర్లు, షేక్ సుభాని, తిరుపీదుల కోటేశ్వరరావు, మన్నం కిషర్, చలంచర్ల కిరణ్‌కుమార్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.